ఆదివారం

ప్రజాశక్తి

సెప్టెంబర్ 5, 2004



పాఠ్యపుస్తకాలకు మతకల్మషం

హ్యాపీ బర్త్‌డే

(5-9-2004 నుంచి 11-9-2004 వరకు)

సాజిద్ అహమ్మద్
1సం॥, 5.9.2003
యాస్మిన్-ముష్తాక్ అహమ్మద్
నెల్లూరు

యామిని
1సం॥, 5.9.2003
పుష్పలత-చంద్రమౌళి
నూలునకల్-నల్లగొండ

మహమ్మద్ రసూల్
1సం॥, 6.9.2003
నజియా-ఖాజా రహ్మతుల్లా
మొగల్లూరు-ప్రకాశం

కె. ధరణి
3సం॥, 6.9.2001
లోకేశ్వరి-కుప్పుస్వామి
రేణిగుంట-చిత్తూరు

ఎ. విప్లవ కుమార్
3సం॥, 7.9.2001
సుజాత-కృష్ణయ్యగౌడ్
అజ్జకొల్లు

కె. సాయి కుమార్
7సం॥, 7.9.1997
భారతి-శ్రీనివాస్
బాలాజీనగర్-హైదరాబాద్

లిఖిత శ్రావణి
3సం॥, 8.9.2001
కల్పన-రమణ
కాపవరం-ప॥గో॥

బి. అక్షయ
3సం॥, 9.9.2001
సోమేశ్వరి-శంకర్
నూతనకల్-నల్లగొండ

నిశాంత్ కార్తికేయ
1సం॥, 9.9.2003
సత్య-ప్రసాద్
ఇందిరానగర్-శ్రీకాకుళం

పవన్ కుమార్
5సం॥, 10.9.1999
ప్రమీల-కృష్ణయ్య
పెంట్లవెల్లి-మ. నగర్

పవన్ సందీప్
7సం॥, 10.9.1997
కృష్ణకుమారి-సీతారామయ్య
విశాఖపట్నం

తేజశ్రీ
2సం॥, 11.9.2002
అంజనీదేవి-శ్రీనివాసరావు
కె. ఉప్పలపాడు-ప్రకాశం

రవీంద్రనాథ్ ఠాగూర్
5సం॥, 11.9.1999
సరస్వతి-నరసింహుడు
బన్నూరు-కర్నూలు

కె. సింధూరి
2సం॥, 2002
మమత-ప్రవీణ్
సిద్ధార్థనగర్-గుంటూరు

పృథ్వి సచిన్
చంద్రకళ-నిక్సన్
కొత్తకోట-మ. నగర్

ప్రణీత్‌సాయి
2సం॥, 2002
రత్నకళ్యాణి-శ్రీనివాసరావు
కాకినాడ-తూ॥గో॥

ఎం.ప్రశాంతి
సెప్టెంబర్-6
సత్యవతి-శ్రీనివాసరావు
మొగల్రాజపురం-విజయవాడ

సంకీర్తన
2సం॥. 2002
మేఘమాల-చందు
వినాయకనగర్-హైదరాబాద్

వెంకట శివ సాయి ప్రసాద్
1సం॥, 2003
కోటేశ్వరి-భాస్కరరావు
గుంటూరు

కొండెపాటి విక్రమ్
5సం॥, 1999
సుమలత-భాస్కరరావు
అబ్బినేని గుంటపాలెం-గుంటూరు

విష్ణు సాయి
6సం॥. 8-8-1998
పుష్పలత-శివరామకృష్ణ
అడ్డగుట్ట-హైదరాబాద్

పి. ఎఫ్రాయిం
పుణ్యవతి-యాదయ్య
నాగన్‌పల్లి-రంగారెడ్డి

ఫరీద్ అలీ
1సం॥, సెప్టెంబర్-2003
సబీరా-అక్రమ్ అలి
నెల్లూరు

భార్గవి
3సం॥, 2001
ఎల్లమ్మ-ఈశ్వర్
తూడుకుర్తి-మ.నగర్

తేజస్విని
రాణి-మహేష్
శక్తిటవర్స్-విశాఖ

గూడూరు వేదవంశి
4సం॥.2000
వాసంతి-భానుప్రతాప్
కోడూరు-నెల్లూరు

కథా నిలయం
శ్రీకాకుళం

రీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం

కవర్‌స్టోరీ హైలైట్

8 ఆగస్టు 2004 ఆదివారం అనుబంధంలో "హాస్యానికి 'పుట్టిల్లు' అల్లు" చదివిన తరువాత సినీపరిశ్రమలో హాస్యరంగంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందిన అల్లు రామలింగయ్యగారు మరణించాడంటే నమ్మలేకపోతున్నాము. దాదాపు వెయ్యి చిత్రాలలో నవ్వుల హరివిల్లుగా వెలుగొంది, సంఘసంస్కర్తగా, స్వాతంత్ర సమరయోధునిగా, హోమియోవైద్యునిగా రాణించిన ఘనత అల్లు రామలింగయ్యగారికే దక్కుతుంది. దాదాపు 50సంవత్సరాలుగా నటునిగా అందించిన సేవలకు అతనికి లభించిన గౌరవాలు అన్నీ యిన్నీ కావు. 2001లో రఘుపతి వెంకయ్య అవార్డుని అల్లు పొందడం హర్షించదగ్గ విషయం. అల్లు మరణించినా అతని హాస్యం తెలుగు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా వుంటుంది. మంచి కవర్‌స్టోరీ అందించిన మీకు ధన్యవాదాలు.

- కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, వరంగల్‌జిల్లా

హాస్యసామ్రాట్

తెలుగు సినిమారంగంలో తనకు తానే సాటిగా అనేక హాస్యపాత్రలు పోషించిన అల్లు రామలింగయ్య అమరుడు! హాస్యసామ్రాట్! రావుగోపాలరావు, అల్లు నటించిన 'ముత్యాలముగ్గు'(బాపు-రమణ చిత్రం)లో నటన అపూర్వమైంది. ఎందరో హాస్యప్రేక్షకుల మదిలో ఈనాటికీ తలచుకుంటే గిలిగింతలు పెట్టకతప్పవు. అల్లు రామలింగయ్య కాలధర్మం చెందిన విశేషాలు మమ్ములను కొద్దిక్షణాలు బాధకు గురిచేశాయి. మన ఆంధ్రప్రదేశ ప్రభుత్వం తరుపున హాస్యనట సామ్రాట్ అల్లు రామలింగయ్య జ్ఞాపకార్థం ప్రతీ ఏడాది అవార్డు ఏర్పాటుకి నిర్ణయించినందుకు మాకెంతో సంతోషంగా ఉంది.

- జె సుధాకరరావు, కాకినాడ.



అనుబంధం బాగుంది

శిరంశెట్టి కాంతారావుగారి కథ "ఓటి బతుకులు" చాలా అద్భుతంగా ఉంది. అంపశయ్య నవీన్‌గారి "ద్వేషంతో కాదు ప్రేమతో గెలవాలి" శీర్షిక ఎంతో బాగుంది. త్రినేత్రుడుగారి రచన "వినోదం మాటున విషాదం"(రియల్‌స్టోరీ) ఎంతో హైలెట్‌గా వుంది. ఈ వారం శీర్షికలు అన్నియు చదివినకొద్దీ ఎంతో రసవత్తరంగా యున్నవి. ప్రచురించిన మీకు, రాసిన రచయతలకు నా కృతజ్ఞతాభివందనములు.

- అన్నే వెంకట కృష్ణారావు,
గన్నవరం, కృష్ణాజిల్లా

అల్లు తపన



అల్లు రామలింగయ్యగారి జీవిత వివరాలు ప్రజాశక్తి ఆదివారం సంచికకే హైలైట్. ఆయన చిన్నప్పుడు నాటకాలలో వేషాల గురించి పడిన తపన, నటుడిగా నిలదొక్కుకోవడానికి పడిన శ్రమ చాలాబాగా రాశారు. అతనొక స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఒక నిర్మాతగా, ఒక వైద్యుడిగా ఒక హాస్యనటుడిగా వివిధరకాల ప్రత్యేకతలను సంతరించుకున్న మహావ్యక్తి అని ఈ సంచిక ద్వారా తెలిసింది. హాస్యానికి 'పుట్టిల్లు' అల్లు అని పేర్కోవడం చాలా బాగుంది.

- పంద్రప్రగడ రాంచందర్ రావు, కొల్లాపూర్

మనలో మాట

అందరూ అదే...కానీ......!

"శ్రీ మద్రమారమణ గోవిందో హరి...అందరూ శ్రీవైష్ణవులే కానీ అదేదో బుట్ట ఖాళీ అయిందట. ఆ ప్రకారంబుగా ఇక్కడకీ ఉపకథ స్వస్తి" అన్నాడు నే వెళ్ళిన హరికథా కాలక్షేపపు హరిదాసులవారు.

నాకైతే నిద్రకొచ్చే విసుగుపుట్టో చాన్నాళ్లకు పుట్టినూరికెళ్ళిన ప్రయాణపు బడలికో లేచి ఇంటిముఖం పట్టాను.

ఆ హరిదాసైతే ఇంతటితో సమాప్తమన్న సామెత, దాని తాలూక కథ కొనసాగుతూనే ఉందంటాను. కొత్త కథనాలతో, సరికొత్త రూపాలతో మనముందు నిన్నా మొన్నా కూడా ఉందీ అంటాను.

కాపోతే తరతరాలనాటి ఆ పాత సామెత ఈ కాలానికి తగ్గట్టుగా మర్పాలన్పిచ్చింది. కాస్త సావధానులుకండయ్యల్లారా...

"అందరూ దేశభక్తులే...కానీ దేశ స్వాతంత్రం హుళక్కే అన్నట్లు...!!"

ఈ కొత్త సామెత వినగానే....

నిన్నా మొన్నటి ఉమాభారతీయం, ఈద్గా మైదానంలోనే తమ ఇష్టమొచ్చిన రయాన, తమ ఇష్టమొచ్చిన రీతిన, తమ ఇష్టమైన హిందుత్వ ఎజెండాకు జాతీయజెండా ఎగరేస్తేనే దేశభక్తనుకున్న కర్ణాటకీయం మీకు గుర్తొస్తే....నాకేం అభ్యంతరం లేదనుకోండి.

కనీసం తమ కార్యాలయగృహాలపై జాతీయజెండా ఎగురేయని వారు, ఘన వాయు ద్రవ ప్రసాద తీర్థ సమస్త వస్తువులపై పేటెంట్ అనబడు గుత్తాధిపత్యంబులను సామ్రాజ్యవాద ప్రభువులంగారి దివ్యసముఖమునకు ధారవోసినవారు తమ పబ్బంబు నిమిత్తమై జాతీయజెండానెగురవైచిన వారూ దేశభక్తులమే అనడం మీకు గుర్తుకువస్తే నాకేమి అభ్యంతరంబు?!

ఎందుకంటే నేనూ చెబుదామనుకున్నదదే కదా!!!

✤

ఈ సంచికలో . . .

ఓరా! . . .	3
కార్టూన్ కదంబం... . . .	4
కవర్ స్టోరీ . . .	5
కథ . . .	8
బాలల కథ . . .	11
బాలనేస్తాలు . . .	12
కచేరి . . .	17
ఆరోగ్యం . . .	18
పుస్తక పరిచయం . . .	20
కళాసాహితి . . .	22
న్యాయసలహాలు . . .	24

ఇంకా...

మూఢనమ్మకాలు తగ్గినయా!

జీవనశైలి ... 10

చేప పిల్ల

రియల్‌స్టోరీ ... 14

చీడపురుగులను దూరం చేస్తేనే క్రీడలకు మనుగడ

క్రీడాసంగతులు . . . 16



బౌద్ధమత ఆనవాళ్ళనిలయం సాంచి, అమరావతి

టూరిస్ట్‌గైడ్ . . . 21

టిక్కెట్ల సంగీతం

అదే పనిగా ప్రయాణం చేయాల్సిరావడం కొందరికి తప్పనిసరి. మరికొందరికి ఉద్యోగ, వ్యాపారాల రిత్యా బస్సుప్రయాణాలు చేస్తారు. ఒకాయనైతే తను ఓ ఆర్నెల్లపాటు ప్రయాణాల బస్సు టిక్కెట్లతో సరదాగా దిండు కుట్టించుకున్నాట్ట! అలాంటి మరో విన్నూత్న ఉత్సాహి మన ముంబయివాలా శశికాంత్ ఖన్వికర్. అతగాడు తనెక్కిన బస్సుల టిక్కెట్లు పారేయడు. ఆ టిక్కెట్లను తన దువ్వెనకు ఒక వరుసలో గుచ్చి ఓ సంగీతపరికరంలా సాపుచేస్తాడు. మౌత్ ఆర్గాన్‌లా నోటితో వాయిస్తూ అందర్నీ ఆకర్షిస్తున్నాడు. లతా మంగేష్కర్ పాడిన 'ఏ మేరే వతన్ కి లోగోం...' పాటను మన శశికాంత్ తన టిక్కెట్ల వాయిద్యంపై వాయిస్తున్నాడు. గిన్నిస్‌బుక్‌లోకి కూడా ఎక్కాలని అదే పనిగా వాయిస్తున్నాడు.



గాడిద మహాశయా...!

ఎన్నికలప్పుడు ఎడాపెడా వాగ్దానాలు ఇచ్చేయడం...అటెనక మొహం చాటేయడం మామూలేగా! "అయ్యా ఏలినవారూ మా మొర వినరూ..." అని ఓట్లేసి గద్దెనెక్కించిన ఓటరే విజ్ఞాపనల కాయితాలట్టుకుని తిరగడమూ మరీ మామూలే!! నిరసనలు...నిరసనలు చేసిచేసి విసుగెత్తితే ఆపై నిరసన ఏ రూపాల్లోకి మారుతుందో చెప్పలేం. మనవాళ్ళొకోసారి దున్నపోతుకి తమ నాయకుడి వేషం వేసి తమ ప్రదర్శన ముందుంచుకుంటుంటారు. అదే స్టయిల్లో పాండిచ్చేరిలోని గుడిసెల జనం తమ మొర ఆలకించని నాయకుడిని "యానిమేట్" చేశారు. తమకు ఇళ్ళపట్టాలివ్వమని ఎన్ని కాయితాలు పెట్టినా కదలని ప్రభుత్వ కార్యాలయం ముందుకొచ్చి గార్ధబేశ్వరరావు(గాడిద)కి తమ మెమోరాండం ఇచ్చారు. తమ నిరసన స్వరానికి ఇలా గాడిద సహాయం తీసుకున్నారు.

మహా దిబ్బరొట్టె!

ప్రపంచ రికార్డు బద్దలుకొట్టడానికి ఏం చేద్దామా అని ఇటలీ నలభీముళ్ళు తెగ ఆలోచించేశారు. ఇటలీ దేశంలోని బార్లీ ఊళ్లో ఉన్న ఒక బేకరీ వంటమేస్త్రీలందరూ కలసి అతిపెద్ద సాండివిచ్ చేద్దాంరి అనుకున్నారు. అదేలేండి...మక్కీకి మక్కీ కాకపోయినా దానికి దగ్గరగా ఉండే మన వంటకం 'మహా దిబ్బరొట్టె' అని చెప్పుకుంటే మనకూ కూసింత నోరూరుద్ది. 700మీటర్ల పొడవుండే నాన్‌వెజ్-సాండివిచ్ తయారీకి నడుం బిగించారా మేస్త్రీలు. సదరన్ పుగ్లియా హిల్‌టాప్ టౌన్ ఆఫ్ మొట్టోలా లో వండిన 1,500కేజీల ఈ మహా సాండివిచ్‌ని 19,000 ముక్కలుగా చేశారు. సదరు ఈ చాకిరీకి 50 మంది వంటవారు, నిర్మాణపుపని కార్మికులు క్రేన్‌లు, కన్వేయర్లు ఉపయోగించి చేశారు.

కార్టూన్ కదంబం

అక్రమ కనెక్షన్లు కట్ చేస్తే షాక్ కొడుతుందని
ఇంట్లోనే ఇలా...
అక్రమ కనెక్షన్ల క్రమబద్ధీకరణ వాయిదా


ఐకమత్యంగా కదలడం కాదు సార్ ఒకర్నొకరు విభేదాలతో తన్నుకోకుండా...
ప్రభుత్వంలోని లోటుపాట్లపై ఐకమత్యంగా కదులుదాం
— బాబు

తెహల్కా
ప్రధానికి లాలూ విజ్ఞప్తి

ఎమర్జెన్సీ కాలంలో ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ తనగురించి, తనపాలన గురించి విపరీతస్థాయిలో గొప్పలుమెప్పులు నమోదు చేసేసుకుని, భూస్థాపితం చేసిన కాలనాళిక (టైమ్‌కాప్సిల్)ను చూసి లోకం 'ఔరా' అని ముక్కున వేలేసుకుంది. భారతదేశ చరిత్రలో తన పాత్ర గురించి తప్పుడు సమాచారాన్ని తరువాతి తరాలకందించే వ్యక్తిగత ప్రయత్నమది. కానీ 1998లో అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వ ప్రభుత్వం ఏకంగా చరిత్రంతటికీ తమ కాషాయపు రంగు పులిమేశారు. కాషాయీకరించిన చరిత్రనే పసి వయస్సులో మెదళ్లకు ఎక్కించాలని పాఠ్యపుస్తకాలను పెద్ద ఎత్తున మార్చివేశారు. నాటి ఇందిరాగాంధిగారి ప్రయత్నం వ్యక్తిగత స్థాయిలోదే అయితే బిజెపి పాలకుల కుట్ర వ్యవస్థా స్థాయిలోది. అధికారాన్ని కొన్నేళ్ళపాటు తమ స్వాధీనంలో పెట్టుకున్న హిందూ మతోన్మాదులు చేసిన ఈ చరిత్రవిధ్వంసా ప్రయత్నాన్ని నిరసించిన చరిత్ర పరిశోధకుల్లో ఒకరైన వకుళాభరణం రామకృష్ణ గారు రాసిన ఈ వ్యాసాన్ని కవర్‌స్టోరీగా అందిస్తున్నాం.



పాఠ్యపుస్తకాలకు మత కల్మషం

వకుళాభరణం రామకృష్ణ

కేంద్ర సెకండరీ విద్యా మండలి (సిబిఎస్‌ఇ) సమావేశం ఈ మధ్యనే కొద్ది రోజుల క్రితం ఢిల్లీలో జరిగింది. కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు తొమ్మిది సంవత్సరాలుగా ఈ మండలిని సమావేశపర్చలేదు. సెకండరీ విద్యకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వ అధీనంలో, అజమాయిషీలో ఉన్న విద్యాసంస్థల అధ్యయనాంశాల గూర్చి నిర్ణయాలు తీసుకోవాల్సిన సంస్థ ఇది. కాగా గత అయిదేళ్ళు అధికారంలో వున్న బి.జె.పి. నాయకత్వంలోని ప్రభుత్వం, విద్యా ప్రణాళికలు తయారుచేసి అమలుపరచబూనినపుడు, వాటిని ఏకపక్షంగా, అప్రజాస్వామికంగా, ఈ మండలిని సంప్రదించి, ఆమోదం పొందకుండానే ప్రవేశపెట్టడం జరిగింది. ఈ చర్య గత ప్రభుత్వపు నియంతృత్వ పోకడలనే గాక, అప్పటి సంఘపరివార శక్తులు, విద్యా విధానాన్ని ఏ విధంగా, తమ మత భావజాలానికి వినియోగింపబూనుకున్నదో గ్రహించవచ్చు. ఈ మండలిలో రాష్ట్రాల విద్యామంత్రులు సభ్యులు. వీరుకాక కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, విద్యావేత్తలూ ఇందులో వుంటారు. సమావేశాన్ని మొదటిరోజు బి.జె.పి.కి చెందిన రాష్ట్రాల విద్యామంత్రులు బహిష్కరించారు. కానీ రెండోరోజు సమావేశానికి హాజరై చర్చల్లో పాల్గొన్నారు.

ఇంతకీ, వీరు చేస్తున్న వాదనలేమిటి? వారి అభ్యంతరాలు దేని గురించి అని ఆలోచించినపుడు, కేంద్రంలో ఏర్పడ్డ నూతన ప్రభుత్వంతో 'తొందరపడి' తీసుకొన్న కొన్ని నిర్ణయాలుగా వీరు చెబుతున్నారు. నిజానికి ఆ తీసుకొన్న నిర్ణయాలను ఈ మండలి ముందుంచి, చర్చించి అవి ఆమోదం పొందితేనే అంతిమంగా అమలుపర్చాలన్న ఉద్దేశ్యంతోనే సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చర్చల్లో పాల్గొనకుండా వారి అభిప్రాయాలు వెల్లడించకుండానే వాటిని బహిష్కరించడం, ప్రజాస్వామ్యం గురించి పదే పదే శ్రీరంగనీతులు వల్లించే వీరికి తెలియాలి. తాము అధికారంలో ఉండగా, ఏ సంప్రదింపులూ లేకుండానే అన్ని నిర్ణయాలను అత్యంత వేగంగా, నిస్సంకోచంగా తీసుకొన్న పరివార శక్తులు ఈ వాదనలు చేయడం సబబు కాదని తేలడంతో నూతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండోరోజు చర్చల్లో పాల్గొనడం జరిగింది.

వీరి అప్రజాస్వామిక వైఖరి అలా వుంచుదాం. ఎందుకంటే వీరు ఎన్.సి.ఇ.ఆర్.టి. ప్రచురించి, గత 30 ఏండ్లకు పైగా వాడుకలో వుండి, అందరి మన్ననలు, ప్రశంసలు పొంది, ప్రామాణిక పాఠ్య గ్రంథాలుగా ప్రాచుర్యానికొచ్చిన వాటిని రద్దు చేశారు. కనీసం అవి రాసిన గ్రంథ కర్తలకు ముందుగా తెలిపి, సంప్రదించి, అవసరమైన మార్పులు వారితో చర్చించనైనా



లేకుండా, కొత్త పుస్తకాలను ప్రవేశ పెట్టారు. కాకుంటే కొత్త ప్రభుత్వం, గత మూడు నెలల్లో విద్యకు సంబంధించి, అందునా చరిత్ర పాఠ్యగ్రంథాలకు సంబంధించి, తీసుకొన్న నిర్ణయాలు, ఇంకా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించుకోవాల్సి వుంది. కాషాయీకరణ లేక మతతత్వపూరిత పాఠ్యగ్రంథాలను తొలగించి, ఆ 'కల్మషాన్ని' '(అర్జున్‌సింగ్‌మాటల్లో 'డిటాక్సిఫికేషన్') కడిగివేసే క్రమంలో మొదటిమెట్టుగా, ఆ గ్రంథాలను పరిశీలించి, లొసుగులను చూపించి, సరైన సిఫార్సులను చేయాల్సిందిగా ముగ్గురు ప్రముఖ చరిత్రకారులతో ఒక కమిటీ వేశారు. పరిపాలనా నియమావళి ప్రకారం ఈ చర్య అవసరమైనా, వాస్తవంలో అలాంటి అవసరం లేదు. అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పాఠ్యగ్రంథాలపై జాతీయ స్థాయిలో విస్తృతమైన చర్చ జరిగింది. ఇందులో చరిత్ర రచన, అధ్యయనం, పరిశోధనారంగాలకు చెందిన అనేకులు, ఇంకా ఇతర విద్యావేత్తలూ వీటిపై తమ వైఖరి తెలిపారు. అందులోని అనేక అప్రస్తుత, అచారిత్రక వక్రీకరణలతో పాటు ఎన్నో యదార్థాలను ఏ విధంగా తప్పులుగా ప్రవేశపెట్టారో ఎత్తి చూపారు. అఖిల భారత హిస్టరీ కాంగ్రెస్ ఆయా చారిత్రక విభాగాల్లో నిష్ణాతులైన ముగ్గురు చరిత్రకారులతో ఒక కమిటీ వేసి, ఆ నివేదికను ఒక గ్రంథంగా ప్రచురించారు. అది రెండు సంవత్సరాల నుండి చెలామణిలో వుంది. అంతేకాదు వక్రీకరణలపై, దేశంలో అనేక సభలు, సెమినార్లు, ప్రతికల్లో పుంఖానుపుంఖాలుగా వ్యాసాలూ వచ్చాయి. అయినా, ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం మళ్ళా ఒక కమిటీని వేసింది. అది ఈ గ్రంథాలను ఉపసంహరించాలని సిఫార్సు చేసింది. అయితే ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై ఒకటి రెండు నెలలైంది కాబట్టి ఇప్పటికి కొంత అదనపు సమాచారాన్ని 'నోట్సు' రూపంలో అందించి, రాబోయే విద్యా సంవత్సరానికి మళ్ళా ముందున్న గ్రంథాలను అవసరమైన మార్పులతో ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం కొంత గుడ్డిలో మెల్లగా వున్నదనుకొన్నా, పాత గ్రంథాలను ప్రవేశపెట్టడంలో ఎందుకు ఒక సంవత్సరం పాటు వాయిదా వేయాలో అర్థం కావడం లేదు. మునుపటి గ్రంథాలు, కేంద్ర విద్యాలయ గ్రంథాలయాల్లో వుండనే వున్నాయి. వాటిని ఈనాటి అభివృద్ధి చెందిన ముద్రణ టెక్నాలజీతో, ఒక నెల రోజుల్లో తయారు చేసి వుండచ్చు. పైగా ఇప్పుడివ్వదలచుకున్న అదనపు 'నోట్సు' చెలామణిలో వున్న గ్రంథాలు - వాటి మధ్య విద్యార్థుల మనసుల్లో గందరగోళం కలిగే అవకాశం వుంది. ప్రముఖ చరిత్రకారులతో పాటు, అఖిల భారత హిస్టరీ కాంగ్రెస్ (అరవై ఏళ్ళకు పైగా దేశంలో అత్యధిక చరిత్రకారులకు, అన్ని భావజాలాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థ), పాత గ్రంథాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు కూడా. అయినా కేంద్ర ప్రభుత్వ తటపటాయింపు సమర్థనీయంగా లేదు.

సంఘపరివారపు విద్యాప్రయోగాలు

1998-2004సం॥లలో ఎన్‌డిఏలోని బిజెపి పాలకులు విద్యావిధానంలో అంతపెద్దఎత్తున, అత్యంత ధైర్యంగా మార్పులు చేయడానికి చాపకింది నీరులా వారు సాగించిన విద్యాబోధనా ప్రయోగశాలలున్నాయి. అవి సరస్వతీ విద్యామందిరాలు, శిశువిద్యామందిరాలు, విద్యాభారతి స్కూళ్ళు తదితర పేర్లతో నడుస్తున్నాయి. 1996 నాటి ప్రభుత్వం దేశంలోని అన్ని బడులలోని సిలబస్‌ని, టెక్స్ట్ పుస్తకాలను సమీక్షించింది. విద్యాభారతి లాంటి స్కూళ్ళలో సంస్కృతి పేర మూఢవిశ్వాసాలను, మత దురహంకారాన్ని చిన్నపిల్లలకు పాఠాల రూపేణ అనేక అభ్యంతరకర పాఠ్యాంశాలను బోధిస్తున్నారని రివ్యూలో తేలింది. ఆనాడు 40వేలమంది టీచర్లు దేశవ్యాపితంగా 6వేల బడులలో 12లక్షలమంది పిల్లలకు ఈ తరహా పాఠాలు బుర్రలకెక్కించేశారు. బిజెపివారు గద్దెనెక్కిన తరువాత అవే పాఠ్యపుస్తకాలు 20వేల విద్యాభారతి స్కూళ్ళలో, శిశువిద్యామందిరాల్లో ప్రవేశపెట్టారు. విద్యానిర్ణాయక కమిటీలనూ కైవసంచేసుకుని విద్యారంగంలో మతతత్వాన్ని ప్రవేశపెట్టి పసివయస్సులోనే ఫాసిస్టు పంథాకు అలవాటు చేయబూనారు. ఆ ప్రయోగాన్ని ఆసరాచేసుకునే తమ పాలనాకాలంలో విద్య కాషాయీకరణకు పూనకం పూనారు.

భారత రాజ్యాంగంలో పొందుపరచుకున్న ప్రాథమిక సూత్రాలు, ప్రజాస్వామ్యం, లౌకికత్వం, సోషలిజంలకు అనుగుణంగా విద్యావిధానాన్ని రూపొందించుకోవాల్సి వుండగా, వీటికి బి.జె.పి. నేతృత్వంలోని ప్రభుత్వం స్వస్తి పలికింది. అది ప్రవేశ పెట్టిన జాతీయ విద్యా ప్రణాళికలో ఇది స్పష్టంగా ద్యోతకమైంది. వాల్యూ ఎడ్యుకేషన్ పేరుతో మత విద్యను ప్రవేశ పెట్టేప్రయత్నం జరిగింది. మతాన్ని గూర్చిన అధ్యయనం వేరు. అది చారిత్రకంగా నిర్వహించిన పాత్ర వేరు. విభిన్న మతాల మధ్య తులనాత్మక అధ్యయనం విద్యార్థులకు కల్పించాలి. వీటి మధ్య గల సారూప్యతను, సార్వజనీక భావాన్ని విద్యార్థులకు వివరించాల్సిన అవసరం వుంది. కానీ, విలువలతో కూడిన విద్య పేరుతో బి.జె.పి. ప్రవేశ పెట్టదలుచుకున్న మత భావజాల విద్య ప్రణాళికను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో వేసిన వ్యాజ్య సందర్భంగా ధర్మాసనం చేసిన హెచ్చరికలను మనం గమనించాలి. "There is a potent danger of religious education being perverted", అంటూ "Religious education should not be reduced to religious instruction", అని తీర్పులో ప్రకటించారు.

మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో, ప్రజలు తమ తీర్పును స్పష్టంగా వెలిబుచ్చారు. ద్వేషం, పరమత అసహనం, మతభావ జాలానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. భారతీయ

టెక్స్ట్ పుస్తకాలు-బిజెపి పాఠాలు

బిజెపి అధికారానికొచ్చాక పాఠ్యపుస్తకాల చరిత్రలో ఆర్యులే అసలైన స్వదేశీయులని, ముస్లింలు భారతీయ సంస్కృతి విధ్వంసకులని వర్ణించారు. హిందూరాజులు మౌర్యులు, గుప్తుల కాలమే స్వర్ణయుగమని, మొగులులు ఏలిన మధ్యయుగాలు అంధయుగాలని చెప్పబూనారు. అదే మధ్యయుగాల కాలంలో విలసిల్లిన సాంస్కృతిక సమ్మేళనాలను, భిన్నమత సంస్కృతుల మేళవింపువల్ల ఆవిర్భవించిన నూతన సాంస్కృతిక రూపాలను, నృత్య-గానరీతులను, పరస్పర సాంస్కృతిక సహజీవనాన్ని కావాలనే ఆ పుస్తకాలలో లేకుండా చేశారు.

ప్రాచీన చరిత్ర: "రాముడు, కృష్ణుడు ధర్మరక్షణ కోసం జన్మించారు. సరస్వతిని, మతాన్ని కాపాడి, ఈ భూమిని పావనం చేయడానికి పలుమార్లు జన్మించారు." ఈ అంశాలతో కూడిన పాఠ్యాంశాలు ఉద్రేకభరితంగా సరస్వతీ, శిశు విద్యామందిరాల్లో 4వ తరగతి విద్యార్థులకు గౌరవగాథ భాగంలో బోధిస్తున్నారు. ద్రవిడ సంస్కృతికి ప్రతీకయిన హరప్పా నాగరికత, వైదిక నాగరికత ఒకటేనని కూడా వక్రీకరించి పాఠాలుగా చెప్పారు. మూఢత్వాన్ని ఈ పుస్తకాలలో అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లారు. 'పుణ్యభారత్' పేరుతో ముద్రించిన మ్యాప్‌లో పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, టిబెట్, మయన్మార్‌లోని భూభాగాలను కూడా కలిపేసి "అఖండభారత్" గా చూపించారు.

మధ్యయుగాల చరిత్ర: ఈ కాలంలో ముస్లింల పాలన అంటే విదేశీపాలనే అని తమ స్వంత నిర్ధారణతో నిర్ణయించేసి పాఠాలలో రాసేసి, పిల్లల బుర్రల్లోకి ఎక్కించే ప్రయత్నం చేశారు. అందుకు హైస్కూల్ ఇతిహాస్ భాగ్, గౌరవగాథ తదితర పుస్తకాలను ముద్రించారు. ముస్లింలంటే విదేశీయులుగా, ఆర్యులంటే స్వదేశీయులుగా చెప్పి, స్వాతంత్ర్యపోరాటపు రెండవభాగం మహ్మద్ గజినీ దురాక్రమణతో ప్రారంభమైందని బోధించడం మొదలెట్టారు. రాముడు జన్మించిన ప్రదేశంలో దేవాలయాన్ని పగలగొట్టి అక్కడ బాబ్రీ మసీదును నిర్మించారని హైస్కూల్ ఇతిహాస్ భాగ్-2 లో 126వ పేజీ ద్వారా పిల్లల మెదళ్ళకెక్కించడం పరివారపు కుట్రయత్నం కాక మరేమిటి?!

ఆధునిక భారత చరిత్ర: 190పేజీల ఈ పాఠ్యపుస్తకంలో స్వాతంత్ర్యపోరాటానికి కేటాయించింది 20పేజీలే. అందులో 3పేజీలు హెడ్గేవార్ గురించి సరిపోయింది. మహ్మదాలీ జిన్నా విలన్‌గా, ముస్లింలు దేశవిభజనకు కారకులుగా, స్వాతంత్రపోరాటానికి ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన పాత్ర చేపట్టినట్టు రాశారు. తరతరాల బానిసత్వం, దారిద్ర్యం నుండి ఆర్‌ఎస్‌ఎస్ రక్షించిందని కూడా రాయడానికి వెనుకాడలేదు.

సాంఘిక, సామాజిక, రాజనీతి, పర్యావరణ శాస్త్రాలను వేటినీ వదలకుండా వాటిల్లోనూ ఈ మతతత్వ త్రిశూలధారులు తమ "పనితనం" చూపారు.



టెక్స్ట్ పుస్తకాలకు జరిగిన నష్టాన్ని సరిచేయండి : చరిత్రకారుల పిలుపు

కేంద్రప్రభుత్వంలో బిజెపి ఉన్నకాలంలో 'ఎన్‌సిఇఆర్‌టి' టెక్స్ట్‌పుస్తకాలలో జరిగిన కాషాయీకరణను వెంటనే తొలగించే చర్య చేపట్టాలని చరిత్రకారులు పిలుపునిచ్చారు. జూన్ 11న "సఫ్దర్‌హష్మీ మెమోరియల్ ట్రస్ట్"(సహమత్) "సంస్థ విద్య-మతతత్వీకరణ వ్యతిరేక సదస్సు" నిర్వహించింది. ఇర్ఫాన్ హబీబ్, సురాజ్‌భన్, డియన్ ఝా, ఆదిత్య ముఖర్జీ తదితర చరిత్రకారులు, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ రాజీవ్ ధావన్, ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్‌లు ఆ సదస్సులో పాల్గొన్నారు. నూతన ప్రభుత్వపు మానవీయ వనరుల అభివృద్ధి శాఖామాత్యులు అర్జున్‌సింగ్ నియమనిబంధనలను పరిశీలించడమనే అనవసరపు ప్రాముఖ్యతనిస్తున్నారని ఆ చరిత్రకారులు అంటున్నారు. బిజెపి ప్రభుత్వం 'వామపక్ష భావాలు' అనే ముద్ర వేసి, పాఠ్యపుస్తకాలను ఒక్కపెట్టున రద్దుచేయడానికి ఏ నీతి-నియమ నిబంధనలు పాటించిందని ప్రశ్నించారు. చరిత్ర, సామాజికశాస్త్ర, సాహిత్య పాఠ్యపుస్తకాలలో మతతత్వ భావజాలంతో చేసిన "కల్తీ"ని సరిచేయడానికి 'ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్"(ఐహెచ్‌సి) వారి నివేదిక ఒక్కటే చాలని కూడా బల్లగుద్ది చెబుతున్నారు. 2002లో ప్రచురించిన రెండు 6వ తరగతి పుస్తకాలు, రెండు 9వ తరగతి పుస్తకాలలో ఈ మతకల్మషం బాగా జరిగింది. ప్రాచీన చరిత్ర, మధ్యయుగాల చరిత్ర, ఆధునిక చరిత్రకు చెందిన పాఠ్యపుస్తకాలు వక్రీకరణకు గురయ్యాయి. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ నివేదించిన "ది రిపోర్టు అండ్ యాన్ ఇండెక్స్ ఆఫ్ ఎర్రర్స్" అనే 130పేజీల నివేదిక ఆధారంగా ఈ పాఠ్యపుస్తకాలను వెంటనే సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు. "పాఠ్యపుస్తకాల రచనలో ఎటువంటి రాజకీయ జోక్యాలు ఉండరాదు. హిస్టరీని హిస్టోరియన్స్ బాధ్యతకి వదిలేయండి. కొన్ని విలువల పునాదిగా విద్యార్థులను తీర్చిదిద్దే పుస్తకాలను విస్తృత పరిశోధనతో రచించాల్సివుంటుంది" అని ప్రభాత్ పట్నాయక్ అన్నారు. "విభిన్న సంస్కృతుల సమ్మేళనం భావనకు పూర్తి వ్యతిరేకమైన ఈ టెక్స్ట్‌పుస్తకాలను నిర్ద్వంధంగా తొలగించాల"ని ఇర్ఫాన్ హబీబ్ అన్నారు. జాతీయోద్యమ వారసత్వ సంపదకు పూర్తి వ్యతిరేకదృక్పథం ఉన్న ఇటువంటి పాఠాలు, భావాలు విద్యాలయాల్లో బోధించరాదని కూడా ఆయన అన్నారు.

బహుళ సంస్కృతిని, ఏక, అఖండ సంస్కృతిగా చిత్రించి, జాతి లౌకిక పునాదులకే ఎసరు పెట్టిన బి.జె.పి. రాజకీయాలకు విసుగు చెంది, తద్విరుద్ధంగా ప్రజాస్వామ్య, ఉదారవాద, వామపక్ష శక్తులకు పట్టం కట్టారు. దేశ స్వాతంత్ర్యం తర్వాత జరిగిన రాజకీయ ఘటనల్లో ఈ ఎన్నికలు అపూర్వ సంచలనాన్ని కలిగించాయి. మతప్రాతిపదికపై సమాజాన్ని విభజించే తత్వానికి విరుద్ధంగా తీర్పునిచ్చాయి. దేశం మొత్తంగా హిందువులందరూ, ఒకే జాతికి, మతానికి, సంస్కృతికి చెందినవారనీ, వారందరికీ ఒకే ఒక ప్రత్యేక గుర్తింపు ఇవ్వడాన్ని సంఘపరివార శక్తులు చేసిన ప్రయత్నాలను, మెజార్టీ హిందువులే తిప్పికొట్టారు. అడ్డూ, ఆపూ లేకుండా పెరుగుతూ వుండిన హిందూ మతతత్వానికి గట్టి దెబ్బే ఈ ఎన్నికలు.

అయితే, ఇంతమాత్రం చేతనే, మతతత్వం వెనుకంజ వేసిందని అనుకోడం, ఉదాసీనతకు దారితీస్తుంది. అయిదేండ్లు రాజకీయాధికారాన్ని తమ మత భావజాల వ్యాప్తికి, విద్యారంగంలో అన్ని పార్శ్వాలకు సంఘపరివార శక్తులు విస్తరింప చేశాయి. అంతక్కుముందు ఒక దశాబ్దం నుండి ముఖ్యంగా అయోధ్య రథ యాత్ర తర్వాత, ఈ శక్తులు దేశంలోని మేధోపర రంగాల్లో చొచ్చుకు పోయాయి. కేవలం ఎన్‌సిఇఆర్‌టి నూతన చరిత్ర గ్రంథాలు మార్చినంత మాత్రాన, పరిస్థితులు మారుతా యనడం సరికాదు. మత భావజాలం, మత శక్తులు, బి.జె.పి. పాలిత రాష్ట్రాల్లో ప్రవేశపెట్టిన విద్యా ప్రణాళికలు, అందులో భాగంగా చరిత్ర, ఇతర సామాజిక శాస్త్రాల పాఠ్య ప్రణాళికలు, గ్రంథాలు మతపూరిత భావాలతో నింపివేశారు. పరివార్ ఆధ్వర్యంలో ఈ రాష్ట్రాల్లో, దాదాపు 30 వేలకు పైగా విద్యాలయాలు స్థాపించి, ప్రైవేటు విద్యకున్న సానుకూలతతో ఈ గ్రంథాలను ప్రవేశపెట్టారు. అవి నేటికీ కొనసాగుతూనే వున్నాయి. బి.జె.పి. నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడక ముందు, జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన, చరిత్ర పాఠ్యగ్రంథాల పరిశీలన కమిటీ ఈ గ్రంథాలను మదింపు చేసింది. వారు సమర్పించిన నివేదికలో ఈ గ్రంథాల్లోని హిందూ మత భావజాలాన్ని ఉదాహరణలతో బట్టబయలు చేయడం జరిగింది. గత చరిత్రను, ఆర్యులు భారతదేశానికే చెందిన వారంటూ, అలెగ్జాండర్ దండ యాత్రను ఎదుర్కొన్న నాటి నుండే, దేశంలో జాతీయోద్యమం ప్రారంభమైందని జాతీయతా వాదానికి కొత్త భాష్యం చెప్పారు. ఇక అప్పటి నుండి, ఈ దేశానికి వలస వచ్చిన వారిని లేదా ఇక్కడికొచ్చి దేశాన్ని ఆక్రమించుకొని, ఇక్కడే స్థిరపడి, చరిత్ర సంస్కృతుల్లో భాగమై, వాటిని సంపన్నం చేసిన వారందరినీ విదేశస్తులుగా అభివర్ణించడం జరిగింది. ఈ ధోరణి, భారతీయులు జరిపిన జాతీయోద్యమాన్ని వక్రీకరించి, కించపరిచే దాకా వెళ్ళింది. అందువల్ల ఇవ్వాళ కేంద్రంలో వున్న నూతన ప్రభుత్వం ఈ గ్రంథాలకు ముందున్న కమిటీ నివేదికల నేపథ్యంలో సవరించి, మార్చాల్సిన అవసరం వుంది. కొత్త కోర్సుల పేరుతో, వేద గణితాన్ని, కర్మకాండను, జ్యోతిష్య విద్యను ప్రవేశ పెట్టడం జరిగింది. వీటి శాస్త్రీయత రుజువయ్యే దాకా, వీటిని పాఠ్యాంశాల నుండి తొలగించేచర్యలు వెంటనే చేపట్టాలి. లేకుంటే, తృణమూల స్థాయిలోనే విద్యార్థుల మనసులు విషపూరితమయ్యే ప్రమాదముంది. దేశంలోని వివిధ విద్యా, పరిశోధనా సంస్థలు గత అయిదేళ్ళ కాలంలో అవలంభించిన విధానాలు, ప్రవేశపెట్టిన మార్పులను ఒకసారి సమీక్షించాల్సిన అవసరం వుంది. ఉదాహరణకు ఐసిహెచ్ఆర్ జాతీయ స్థాయిలో గత నలభై ఏండ్లుగా చరిత్ర పరిశోధనకు, గ్రాంట్ల మంజూరుకు, ఉత్తమ గ్రంథాల ప్రచురణకు ఏర్పడి పని చేస్తున్న సంస్థ. అది ప్రారంభించిన Towards Freedom Project ఎంతో ప్రాముఖ్యత కలది. ఇద్దరు ప్రముఖ చరిత్రకారులు ఫణిక్కర్, సుమిత్ సర్కార్‌లు మార్చిన రెండు గ్రంథాలను ప్రచురించకుండా ఆపివేయడం జరిగింది. స్వాతంత్రోద్యమంలో ఈ సంఘపరివార్ శక్తులు దాదాపు పాల్గొనలేదు. పైగా జాతీయోద్యమాన్ని దానికి నాయకత్వం వహించిన అఖిల భారత కాంగ్రెస్‌కు దాని నాయకులైన గాంధీ, నెహ్రూ, పటేల్, అజాద్ లాంటి వారిని కించపరుస్తూ రాయడమే గాక, ప్రచారం చేశారు కూడా. అందువల్ల ఈ రెండు సంపుటాలు ప్రచురిస్తే, వారి బండారం బయటపడుతుందన్న భయమూ వుండి వుండాలి. అలాగే సిమ్లాలోని జాతీయ పరిశోధనా సంస్థ, ఐసిఎస్ఎస్ఆర్, యుజిసి లాంటి అత్యున్నత జాతీయ సంస్థలకు, గతంలో ఉద్దండులైన విద్యావేత్తలు, శాస్త్రవేత్తలూ సభ్యులుగా వుండేవారు. ఆ పరిస్థితికి భిన్నంగా కేవలం తమ వారితో వీటిని నింపివేయడం కూడా జరిగింది. ఇలాగే మరెన్నో విధాలుగా విస్తరించి, లౌకిక సమాజ పునాదుల్నే మార్చివేసే ప్రభుత్వాలకు, నూతన ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి. లేకుంటే ఎన్నికల్లో ప్రజలిచ్చిన చారిత్రాత్మక అవకాశాన్ని జారవిడుచుకున్నట్టే!

(బాక్స్ ఐటమ్స్ : సండే డెస్క్)

ఓ బలీ... కో బలీ

మార్ల మనోహర్

వల్లకోటు న్యాయవాదులు హడావిడిగా తిరుగుతున్నారు, కోర్టు ప్రాంగణ మంతా జనంతో క్రిక్కిరిసింది. ఇక కాసేపట్లో వెలువడే తీర్పు కోసం ముద్దాయిల బంధువులు, ఆప్తులు, బిక్కమొహాలేస్కొని, చకోర పక్షుల్లా ఎదురుచూస్తున్నారు. "గత ఐదు సంవత్సరాల క్రితం హనుమాపురం గ్రామంలో బోయపుల్లన్న, గొల్లకంబగిరి, అలియాస్ పోతప్పని పట్టపగలు నడి ఊర్లో దారుణంగ హత్య చేసిన ఎరికల కిష్టప్ప, ఎరికల అంజీ, వడ్డే వెంకట్రాముడు, వడ్డే నాగరాజు అలియాస్ నాగ, హరిజన నరసింహులు, హరిజన చిన్న ఓబిలేసులపై మోపబడిన హత్యకేసులో సాక్ష్యాధారాలు రుజువైనందున పై ఆరుగురికి, ఐ.పి.సి. 302 సెక్షన్ ప్రకారం యావజ్జీవ శిక్ష విధించడమైనది. ఈ హత్యల్ని దగ్గరుండి జరిపించిన ఎరికల కిష్టప్పకి మరో రెండు సంవత్సరాలు కఠిన కారాగారశిక్ష విధించడమైనద"న్న తీర్పు వినగానే ఆ ప్రాంతమంత ఒక్కసారి ఘొల్లుమంది. ముద్దాయిల బంధువులు ఒకర్నొకరు పట్టుకొని గుండెలవిసేల భోరున విలపిస్తున్నారు. పోలీసులు భారీ బందోబస్తు మధ్య ముద్దాయిల్ని అటునుండి అటే జైలుకి తరలించటానికి సన్నాహాలు చేస్తున్నారు. కోర్టుహాలు నుండి ముద్దాయిలు బిగ్గరగా ఏడ్చుకుంటూ బయటకొస్తున్నారు. మొదట బయటకొచ్చిన వడ్డే వెంకట్రాముడిని గట్టిగ పట్టుకొని "ఏం. మామా! ఇంతపనిచేత్తివి? శిచ్చ మోస్కొని నువ్వు నీ దావకొద్ది పోతాండేవే. ఇంతమంది పిల్లల్ని నేనెట్ల సాకల్లారా.. దేవుడా!" అని చిరిగిన చొక్కాలతో మాసినతలల్తో ఉన్న చిన్న పిల్లల్ని అక్కున చేర్చుకొని భోరున విలపిస్తూ గుండెలు బాదుకొంటోంది వెంకట్రాముడి భార్య అనుమక్క.

"ఓర్యా. నాగా! నీమీదెన్ని ఆశలు పెట్టుకున్నాం రా! మా ఆశలు ఆడియాశలు చేసి నీ పెళ్ళాం పిల్లల్ని నా వాతనేసి, నీ దావ కొద్ది నువ్వు పోతే ఈ ముసలి వయసులో నీ పెళ్ళాం పిల్లల్ని నేనెట్ల సాకల్లరా...." అని లబలబ నోరు కొట్టుకుంటు నేలపైపడి పొర్లి పొర్లి ఏడుస్తొంది నాగరాజు తల్లి మంగమ్మ.

"నాలుగు రాళ్ళు కొట్టి మా నోట్లో ఇంత గంజి పోత్తావని ఆశ పెట్టుకొంటే. మా నోట్లో మన్ను కొట్టి నానెత్తిన రాళ్ళేసి పోతాండావు కదరా.." అని బిగ్గరగ అరుస్తూ ఏడుస్తున్న మంగమ్మ అరుపులతో ఆ ప్రాంతమంత మారు మ్రోగుతొంది. ఆప్తుల కన్నీటితో ఆ ప్రాంతమంత తడిచినట్లైంది.

భారీ బందోబస్తు మధ్య బయటకొస్తున్న ప్రథమ ముద్దాయి కిష్టప్పని చూడగానే, ఆత్రంగ అతడి తల్లి ఎదురెక్కిపోయి, "ఓర్యా! కిట్టప్పా, ఆ దేవుడెంత శిచ్చేసినాడ్రా నీకి! సచ్చి నీ తండ్రి మాకు దూరమైతే, బతికుండగానే మీరు మాకు దూరమైతాండారు కదరా... నేనెంత ఖర్మ చేస్కున్నాన్రా దేవుడా.. ఆ దొంగ యాటలు తినే ఆ దేవునికి నా గోడు నా ఉసురు తప్పక తగుల్తుందిరా".. అని బిగ్గరగ ఏడుస్తూ కనిపించని ఆ దేవుడికి శాపనార్థాలు పెడ్తాంది కిష్టప్ప తల్లి పుల్లమ్మ.

"చూడ్రా అంజీ! నీ పెండ్లాన్ని కండ్లారా చూడ్రా. నిండ నెలలతో ఉందే, రేపిది కానుపై దీనికి కొడుకో బిడ్డో పుట్టి అమ్మా! నాయనేడే అంటే అదేం జవాబు చెప్తాదిరా.. వాళ్ళని నేనెట్ల సంజాయించల్లారా.. అందుకేరా... నేను మీకు ముందునుంచి మొత్తుకొని చెప్తాండేది. వద్దురా మనకీ....కచ్చలంటే వినకపోతిరి. మా రొడ్డి సర్పంచ్ కావల్ల.. మా రొడ్డి సర్పంచ్ కావల్లని కని కచ్చలు రేప్కొని ఖూనీలు చేసి కుతికెల మీదికి తెచ్చుకుంటిరి. పనికిరాని పార్టీలతో బతుకులు నాశనం చేసుకుంటిరి. ఇంట్లో మగ దిక్కులేక, ముగ్గురం ఆడదాన్లము పోయి గుండ్లళ్ళా మిగిలినాం కదరా. ఇప్పుడెవ్వర్రా.. మాకు మగ దిక్కు?" అని బిగ్గరగ ఏడుస్తున్న పుల్లమ్మని అక్కున చేర్చుకొని "అమ్మా! ఏడసద్దే. ఆ రొడ్డి మనకి సపోటున్నంత వరకు మాకేం కాదు, ఆయప్ప మమ్మల్ని ఖచ్చితంగా బయటికి రప్పిత్తాడు. ఆయప్ప మమ్మల్ని ఎన్నటికీ దూరం చేస్కోడు. ఈ కోర్టులో కాకున్న పై కోర్టుకి పోయి అయినాసరే మమ్మల్ని బయటికి రప్పిత్తాడు. బాదపడొద్దమ్మా! మేమింకా రెండ్రోజులీడే ఉంటాం, నువ్వీ పొద్దు ఊరికి పోయి రేపు రొడ్డినొచ్చి మాతో మాట్లాడిపొమ్మను. అయప్పతో చెప్పి పై కోర్టులో అప్పీలు చేపిత్తాము. మీరేం బాదపడొద్దండ"ని భరోస ఇస్తుండగానే "ఊ..పా...పా..."అంటూ పోలీసులు కిష్టప్ప చేయి పట్టుకొని వ్యానులోకి ఎక్కించారు.

ముందుకుపోతున్న ముద్దాయిలకు కడసారిగ కన్నీటి వీడ్కోలు పలికి కొంగుతో కన్నీళ్ళు తుడ్చుకొని ఇంటిదారి పట్టింది పుల్లమ్మ. బస్సులో కూర్చొని ఏడుస్తూనే ఉంది. కళ్ళ నుండి ఉబికి వస్తున్న కన్నీళ్ళను పైటకొంగుతో తుడ్చుకుంటూ దృష్టిని కిటికీ వైపు మరల్చి పిచ్చిచూపులు చూస్తొంది. బస్సు వేగమందుకొని రివ్వున ముందుకు దూసుకపోతొంది. అంతే వేగంతో పుల్లమ్మ ఆలోచన్లు కూడా గిర్రున వెనక్కి తిరిగి అయిదు సంవత్సరాల గతంలోకి వెళ్ళాయి.

* * *

సాయం సంధ్య వేళ రచ్చకట్ట వద్ద జనం గుమి గూడి ఉన్నారు. జనం మధ్యలో బిగ్గరగా అరుస్తున్నాడు పుల్లారెడ్డి.

"లేదు. నేనే. ఈతూరి సర్పంచిగా పోటీ చేత్తా. నా నిర్ణయంలో మార్పు లేదు"

"అదేందోయ్! పుల్లారెడ్డి అంత నిక్కచ్చిగా మాట్లాడ్తావ్. ఈ తూరి ఒక్కసారీయప్ప నాకు చాన్సు. మళ్ళా తూరి కావల్లంటే నువ్వే నిలబడు. అప్పుడు నేను నీకి సపోటు చేత్తా". కాస్త బుజ్జగింపుగా అడిగాడు రంగారెడ్డి

"లేదు.. లేదు.. నా నిర్ణయలో తిరుగులేదు. రాక రాక చాన్సొచ్చింది ఈ. చాన్సుని నేనెట్ల పోగొట్టుకుంటా? చూడు రంగారెడ్డి! నువ్వు సపోటు చేత్తే నేనేకగ్రీవంగా ఈ వూరికి సర్పంచి కావల్లనుకొంటి. కాని నువ్వే నాకడ్డం వత్తే నీతో కూడ పోటీ చేసే దానికి నేను సిద్ధం".

పుల్లారెడ్డి రంగారెడ్డి ఇద్దరూ వరసకి బావా బావమరుదులు. వాళ్ళిద్దరే ఆ వూర్లో పెత్తందార్లు. కాని వాళ్ళిద్దరు ఎప్పట్నుంచో ఒకరికి తెలియకుండా ఒకరు, తమ తమ హృదయాల్లో ఆశాసౌదాలు నిర్మించుకున్నారు. సర్పంచై, గ్రామాధిపత్యం చెలాయించల్లనే ఆశ.

"ఏం పుల్లారెడ్డీ! ఇదేనా, నీ కడమాట. మాట మార్చుకోవా? చూడు పుల్లారెడ్డి నువ్వు నాకు సపోటు చేత్తావనే ఆశతోనే నేను బోయళ్ళకి గోళ్ళోలుకి, మాలోల్లకి మాటిచ్చినాను. వాళ్ళు కూడ నన్ను శానా వత్తిడి చేత్తాండారు". ఆశ మనసులో పెట్టుకొని నింద అనుచరులపైకి వేశాడు రంగారెడ్డి.

తన ఆశాసౌదాన్ని పేకమేడలా కూల్చటానికి ప్రయత్నిస్తున్న రంగారెడ్డి మనస్తత్వంని గుర్తించిన పుల్లారెడ్డి ఆగ్రహంతో ముఖమంతా చిట్లిస్తూ.

"ఏంది రంగారెడ్డి! నిన్ను బాయోళ్ళు, గొల్లోలు. మాలోల్లు వత్తిడి చేత్తాంటే, నాక్కుడా ఎరికలోళ్ళు.

వడ్లోళ్ళు, మాదిగోళ్ళు వత్తిడి చేత్తాండారు" అన్నాడు పుల్లారెడ్డి.

"ఏందో దగ్గర బంధువుడివి అని అయ్యా... అప్పా... అని అడుగుతాండాను. అడిగేకొద్ది నీల్గి నీల్గి మాట్లాడ్తాండావ్. ఏం నువ్వు నీల్గి నీల్గి మాట్లాడ్తే నేను తగ్గుతాననుకున్నావా? రా...పో.. చూస్కుందాం. నీకు నాకు సవాల్. ఎవరు చేతనైతే వాళ్ళు గెలుద్దాం." చిన్న సవాల్ విసిరిడు రంగారెడ్డి.

"అయితే నువ్వెట్ల నామినేషన్ చెత్తావో మేమూ చూత్తాంలే రొడ్డీ!" ... మాటల మధ్యకి జోక్యం చేస్కొని హెచ్చరించాడు ఎరికల కిష్టప్ప అల్లుడు అంజీ.

"అదేందిలే! మధ్యలో నువ్వు జోక్యం చేస్కొని మాట్లాడ్తావ్. వాళ్ళిద్దరూ మాట్లాడ్తానారు కదా. వాళ్ళిద్దరూ ఒకే కులచ్చులు. మనం తగ్గు కులచ్చాలం, వాళ్ళ మాటల్లో మనకెందుకు జోక్యం పెద్ద మొగోనిగ మాట్లాడ్తాండావ్". ఎరికల అంజీని మెత్తగ మందలించాడు బోయ పుల్లన్న

"ఏంరా! పులిగా జాతీగ మాట్లాడ్తాండావ్. ఏం నకరాలు చేత్తాండావ్? నిన్నేమన్నాడు వాడు? నీల్గి నీల్గి మాట్లాడ్తాండావు". పరుషంగ మాట్లాడ్తూ ముందుకొచ్చాడు ఎరికల కిష్టప్ప.

"ఏంలే కిష్టిగా! చూత్తాంటే మీది మీది కొత్తాండావ్. ఏం నకరాలు చేత్తాండావ్. అయప్పేం తప్పు మాట్లాడినాడని అయప్ప మీదికి పూని పూని పోతాండావ్. పెద్దొళ్ళు మాటల్లో మనకెందురా జోక్యం అన్నాడు. అంతమాత్రానికి నువ్వేం అయప్ప మీదికి బోగు పోతాండావ్. కొంచెం ముందూ వెనుక చూస్కోని మాట్లాడు. నకరాలు చేత్తే పయి పగుల్తుంది కొడకా". ఘాటుగ హెచ్చరించాడు గొల్ల కంబగిరి.

"నువ్వు పయి పగలకొడ్తే ఇక్కడెవ్వరూ గాజులేస్కోని కూకోలేదురా. మా మీద చెయ్యి పడితే మీ తలకాయలు పుట్ట చెండ్లళ్ళా పగుల్తాయి కొడకా" అని బండి నాటు తీస్కోని ముందుకొచ్చాడు ఎరికల కిష్టప్ప.

ఊర్లో పెళ్ళికి ఊర కుక్కలు కొట్లాడినట్లు. తమ తమ నేతల మెప్పుకోసం పరస్పర సవాళ్ళు విసురుకుంటూ ప్రభు భక్తిని చాటుకుంటూన్నారిద్దరూ.

అగ్నికి ఆజ్యాన్ని తోడు చేసినట్లు వాళ్ళ సవాళ్ళని ప్రోత్సహిస్తూ..."ఊ.కొట్టండ్రా తిట్టండ్రా.." అని వెనుక నుండి పిర్రె గిల్లి ప్రోత్సహిస్తున్నారా ఇద్దరు నేతలు.

"రొడ్డీ! నువ్వు ఊ... అను వాళ్ళ నెత్తర తాగుతాము"అంటూ పళ్ళు పటపట కొరికాడు కిష్టప్ప.

"ఆ...రారా...కొడుకా...మా నెత్తురు తాగుతావా? రారా చూస్కుందాం... నీ తలకాయ మూడుముక్కలౌతాది కొడకా" అని బాణాకర్ర తీస్కోని ముందుకురికొచ్చాడు కంబగిరి.

"ఆ...రారా కొడుకా...చూస్కుందాం...రా" అంటూ గట్టిగా ఈలవేసి రణశంఖం ఊదాడు కిష్టప్ప.

ఆ క్షణం. ఆ ప్రాంతమంత ఉద్రిక్తంగ మారింది. తమ నేతల స్వార్థం గుర్తించక సౌభ్రాతృత్యం మరిచి, కుల కుంపటిని రాజేస్కున్నారు. ఎరికల వడ్డే హరిజనులు ఓ వైపు, గొల్ల, బోయ, మాల గుంపు మరోవైపు నిలబడి రాళ్ళు తీస్కోని రణరంగానికి సిద్ధమయ్యారు. జరగబోయే విపత్కర పరిస్థితిని గుర్తించిన పుల్లమ్మ ఇదేదో పెద్ద రచ్చ జరుగుతుందని గుర్తించి, గట్టిగ అరుచుకుంటూ... తన వాళ్ళ గుంప మధ్యకి పోయి "వద్దురా కిట్టప్పా! మనకీ కొట్లాటలు. వేగునలేచి ఊర్లో ఒకరి మొకాలొకరు చూస్కొండాడం, ఊర్లో అంతా అన్నదమ్ముల్లా కల్సి మెల్సి ఉన్నాం, పెద్దొళ్ళ పీకులాట మనకెందుకురా? ఆవులావులు కొట్లాడ్తే దూడలకేరా కాళ్ళిరిగేది, ఎవరు సర్పంచి అయితే మనకేం మనకట్టం మనికి తప్పింది కాదు, ఏందో దబ్బులు అమ్ముకొని బతుకు తాండాం, మన కొడ్దురా ఈ పెద్దొళ్ళ పీకులాట, నా కొడుకువైనా కాని, నీ కాళ్ళు పట్టుకుంటారా, వద్దురా మనకీ రంపులు" అని ఏడుస్తు బుజ్జగిస్తోంది.

పుల్లన్న ఆమె చేయిని విసిరకొడ్తూ. "థూ.. నీయమ్మ ముసలిముండా, ఇప్పుడేం జరిగిందని అట్లేడుచ్చాండావ్, ఆ పక్కోళ్ళు వాళ్ళ రొడ్డిని సపోటు చేత్తే మనం మనరొడ్డిని సపోటు చెయ్యకూడదా? మన రొడ్డి మనకి సర్పంచైతే మనకెంత మేలో తెల్సా? మన ఎరికల గుడిసెలకి పట్టాలిప్పాత్తానన్నాడు, వడ్లోళ్ళకి రూములు కట్టిత్తానన్నాడు. మాదిగోళ్ళకి ఊరిబయట దేవుని మాన్యంలో కొట్టాలేపిత్తానన్నాడు, అయప్ప మనకివ్వన్ని చేత్తానంటేనే, మేమంత అయప్పకి సపోటు చేత్తాండేది. నీకేం తెల్సని నువ్వు మాట్టాడ్తాండావ్. మా పాణాలు పోయినా సరే మేమాయప్పకి సపోటు చేసి ఎలచ్చన్లో పనిచేసి సర్పంచిగా గెలిపిత్తాం"

రంగారెడ్డి కల్లందొడ్లో సారాసీసాలు గలగల సవ్వడి చేస్తొండాయ్, కంబగిరి పుల్లన్న, ఓబిలేసు పీకలదాకా తాగి మత్తుగా తూగుతున్నారు, రంగారెడ్డి నూలక మంచంపై కూర్చోని తన అనుచరులకి పౌరుషం నూరిపోస్తున్నాడు.

"ఓరేయ్. పులిగా! ఈ చాన్సు మనం



పోగొట్టుకోకూడదు, ఇప్పుడీచాన్సు తప్పోతే మల్లెప్పుడూ ఈ చాన్సురాదు, అందర్ని అదరగొట్టో బెదరగొట్టో అయినా సరే ఈ తూరిమాత్రం మనమే సర్పంచి కావల్ల. ఇందుకు ఎన్నిదుడ్లు ఖర్చు అయినా, ఎన్ని రంపులైనా చింతలేదు. ఏం చేత్తారో ఏమో అంతా మీదే బాధ్యత"ని పుల్లన్న భుజంతట్టి బాధ్యతని అప్పజెప్పాడు రంగారెడ్డి,

మరుసటిరోజు ఊర్లో ఎన్నికల డంకా మ్రోగింది. ఎవరికి వారు ఎన్నికల పోరాటంలో తమ తమ నేతల విజయాలకై రణశంఖం ఊదారు.

ఊర్లో కులాలు సైన్యాలుగా మారి, కులనేతలు, సైన్యాధిపతులై సేనలను ముందుకు నడిపిస్తూ... రణానికైనా మరణానికైనా సిద్ధమైనారు.

సవాల్ ప్రతి సవాళ్ళతో అనుచరుల అరుపులకేకలతో స్వల్ప ఉద్రిక్తత మధ్య ఇరువురు నేతలు నామినేషన్ చేసి వచ్చినారు. ఎవరికి వారు తమ గెలుపు కోసం సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. అదిరించో బెదిరించో ఓటర్లని తమవైపుకు తిప్పుకుంటున్నారు. ఓటర్లపై డబ్బుల వర్షం కురిపిస్తూ సారా ప్రవాహంలోకి తోస్తున్నారు. ప్రచారం ఘట్టం పూర్తి చేసుకొని పోలింగ్ తేదినాడు సర్వం సిద్ధం చేస్కొని కూర్చున్నారు. ఓటర్లని ఆకట్టుకోవటం కోసం పొట్టేళ్ళని కోసి ఓటర్లకి విందు పెట్టారు.

'పోలీసుల భారీ బందోబస్తు మధ్య అనుచరుల స్వల్ప ఘర్షణలతో పోలింగ్ ముగిసింది. పచ్చిపులుసు పుల్లారెడ్డిపై నడిమింటి రంగారెడ్డి నలభై ఓట్ల తేడాతో గెలిచాడని ఫలితం వినగానే రంగారెడ్డి వర్గం ఆనందంతో కేరింతలు కొట్టి రంగులు చల్లుకొని సంబర పడిపోతూ రంగారెడ్డిని భుజాలపైకి ఎక్కించుకొని రంగారెడ్డి జిందాబాద్ భూమ్యాకాశాలు దద్దరిల్లేలా అరుస్తున్నాయి.

ఓటమి జీర్ణించుకోలేని పుల్లారెడ్డి పగతో రగిలిపోయాడు. "ఓరేయ్ కిష్టిగా! మీరు నన్ను గెలిపిత్తారని నమ్మకం పెట్టుకుంటే, ఆశని నాశనం చేసినారు కదరా".

"రొడ్డీ! నువ్వు నన్ను చులకచూచ్చంగ మాట్లాడొద్దు. పొరపాటు జరిగింది. ఇప్పుడేం చేయ్యాలో చెప్పు. నీకు దక్కని కుర్చీ మరొకరికి దక్కటానికి నేనొప్పుకోను. అందుకు మేమేం చెయ్యాల్లో చెప్పు"ని కిట్టప్ప ఆగ్రహంతో ముందుకొచ్చాడు

ఇనుము కాగినప్పుడే తనకనుగుణంగ మలుచుకోవాలనే గుణమున్న పుల్లారెడ్డి, కిట్టప్పలోని ఆగ్రహాన్ని పసిగట్టి, "ఓరేయ్ కిట్టప్పా! నీ కోపం చూత్తాంటే నువ్వు రంగారెడ్డిని గిల్లేయాలని చూత్తాండావ్. రంగారెడ్డిని గిల్లేస్తే మనకేం లాభం? వాడు చత్తే వాని కొడుకు మనకి పోటీకొత్తాడు అప్పుడు మనకి ఊర్లో మరింత బరువైతాది. అందుకు రంగారెడ్డిని చంపకూడదు వానికి బలంగ సపోటిచ్చే పులిగాన్ని, కంబగిరిగాన్ని గిల్లేస్తే మనకీ ఊర్లో ఎదురే ఉండదు". అనుచరుల మనుసులోకి చిన్నగ విషబీజాలు నాటినాడు పుల్లారెడ్డి.

పుల్లారెడ్డి వేసే ఎత్తుగడ, అతడి అంతరాలోచనని గుర్తించని కిష్టప్ప, మూర్ఖత్వంతో, ఆగ్రహంగా పిడికిళ్ళు బిగించి, "రొడ్డీ! నూ ఊ...అను వాళ్ళమీద బాంబులు బేచ్చా, యాట కొడవలితో వాళ్ళిద్దరి తలలు నరికి నీకాళ్ళ దగ్గర పెడ్తా" అని పౌరుషంతో ఊగిపోయాడు.

"రేయ్! మీరాపని చెయ్యండి, మీ ఎనుక నేనుంటా, ఇందులో ఏం నట్టం జరిగినా మీ ఎనుక నేనుంటా. ఎన్ని దుడ్లు ఖర్చైనా సరే కోర్టులో ఏజ్యమాడ్తా. మీకేమన్న ఇబ్బందులొత్తే మీ పెళ్ళాం పిల్లల్ని నేను సాక్తా. నా ఆస్థిమొత్తం ఇట్లే ఖర్చైనా సరే మిమ్మల్ని నేను ఆదుకుంటా. మీరు మాత్రం నేను చెప్పిన పని శానా భద్రంగా జరపల్ల. వాళ్ళిద్దర్ని గిల్లేసే వరకు నాకు కనపడద్దండి, పోండి." పదండంటూ వాళ్ళని ఉసిగొల్పి అక్కడ్నుంచి పంపించాడు పుల్లారెడ్డి.

* * *

కాలచక్రం గిర్రున తిరుగుతోంది. రోజులు గడుస్తొండాయి. కసితో రగిలిపోతున్న కిష్టప్ప, వెంకట్రాముడు, ఓబిలేసు ప్రతిరోజు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. మిట్టమధ్యాహ్నం రచ్చకట్ట వద్ద చిన్న పిల్లలు చిల్లా-కర్రా ఆట ఆడుతున్నారు. వారికి కొద్ది దూరంలో పుల్లన్న రచ్చకట్టపై కూర్చోని పిల్లల ఆటని గమనిస్తున్నారు. వాళ్ళకి మరికొద్ది దూరంలోనే ఇద్దరు ఆడవాళ్ళు బోరింగు నీళ్ళు కొట్టుకుంటూ మాటల్లో లీనమయ్యారు. ఆటని ఆసక్తిగా గమనిస్తున్న పుల్లన్నకి అటుగా పోయే కంబగిరిని చూచి," ఏంవోయ్ కంబ్గిరి! యాటికోయ్. ఎండపొద్దున ఎళ్ళబారినావ్?" పలకరింపుగా అడిగాడు.

"ఏంలేదు మామా! గుట్టకాడికి గొర్ల మందొచ్చింది, జీవాలని చూసొద్దమని పోతాండా"నని నిలబడి బదులిచ్చాడు.

"సరేరాబ్బా! ఎండ పొద్దునేం పోయిన్నావ్, రా. ఓ ఆట ఆడిపోదువుగాని" కట్టమీద నుంచి కిందికి దిగి గులక రాళ్ళేరుకొని ఓబిలేసుని పులిజూదానికి

(మిగతా 15వ పేజీలో)

మాలిని ఎప్పుడోగాని రాదు. వచ్చిందంటె ఏదో విశేషమున్నట్టే. "ఏం లేదు ఆంటీ! మీతో మాట్లాడుదామని వచ్చాను. ఈరోజు పొద్దున నాకూ మా వారికి పెద్ద యుద్ధం.. బాగా వాదించుకున్నామనుకోండి!" నవ్వింది మాలిని.

మూఢనమ్మకాలు తగ్గినయా!

డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి

"ఇంతకు దేన్ని గురించి మహాభారత యుద్ధం" అడిగాన్నేను. "ఆంటీ! ఆయనంటారు మునుపటికీ ఇప్పటికీ మూఢనమ్మకాలు చాల తగ్గాయి. విధవల సంగతే తీసుకో – భర్త చనిపోతే ఆ స్త్రీ అశుభాలని, ఇది చేయకూడదు అది చేయకూడదనే అర్థంలేని కట్టుబాట్లు నమ్మకాలుండేయి. ఇప్పుడవేవీ లేవు. అట్లానే పాములు, తేళ్ళు కరిస్తే మంత్రాలని కుక్క కరిస్తే కూడా మంత్రమని వెరిమొర్రి నమ్మకాలుండేయి పూర్వం. ఇప్పుడవేవి లేవు. మూఢనమ్మకాలు తగ్గుముఖం పట్టాయి అంటారు. నేనేమో ఏం తగ్గలేదు. ఇంకా ఎక్కువవుతున్నాయన్నాను. పుష్కరాలకు ప్రతీ ఏడాదీ జనం పెరుగుతున్నారు అంటే ఏంటి ఆంటీ... మీరే చెప్పండి ఎవరు చెప్పిందాంట్లో నిజముంది..." అడిగింది.

"నిజం చెప్పాలంటె మీ ఆయన అన్నదాంట్లో కొంత సత్యం లేకపోలేదు. కాని ఇంకా మారుమూల ప్రాంతాల్లో ఆర్థికంగా అభివృద్ధి లేని చోటుల్లో విధవలంటె పాత అభిప్రాయాలు మాసిపోకుండా వున్నాయి. అంతెందుకు అప్పుడెప్పుడో రూప్ కన్వర్ అనే యువతిని జనం సతీసహగమనం చేయించారు. గుర్తుందా?–" అడిగాన్నేను.

"అవును గుర్తుంది అంటీ! అటువంటి దురాచారాలు మూఢవిశ్వాసాలు అంతరించటం లేదు"

"నువ్వనేది నిజమే మాలినీ! ఆలోచిస్తే మూఢ నమ్మకాలు మన సమాజంలో ఏం తగ్గలేదనే అనిపిస్తుంది నాకు–" మధ్యలో నన్నాపి ఏదో అనబోయింది ఆవేశంగా మాలిని. తనే గెల్చానని ఆవేశం పెరుగుతున్నది మాలినికి.

"మాలినీ! ఆగు నేను చెప్పేది విను కాస్త. వాస్తు అంటూ చాలామందికి నమ్మకం పుట్టుకొచ్చిందా లేదా? గాలి వెలుతురు చూసుకొని ఇల్లు కట్టటం శాస్త్రీయమే కాని వాస్తుపేరుతో ఇండ్లల్లో గోడలు, మెట్లు, కిటికీలు, తలుపులు వగైరా కూలగొట్టించటం మూఢనమ్మకం కాదా చెప్పు!" అడిగాన్నేను మాలినిని.

"అదే నేనంటున్నాను ఆంటీ! ఒకాయన పాపం ఈ వాస్తు చక్కర్‌లో పడి రిటైరయినంక వచ్చిన డబ్బునంతా అంతకుముందు సర్వీస్‌లో వున్నప్పుడు కట్టించుకున్న ఇంటిని కూలగొట్టి కూలగొట్టి మార్చి మార్చి కట్టటంలో ఖర్చుపెట్టేసాడట. ఇప్పుడు చేతిలో డబ్బులేని అతని కొడుకు లెవరూ దరికి చేరనీయటం లేదట. పోయి వృద్ధాశ్రమంలో పెన్షన్‌తో బతుకుతున్నాడు. ఆంటీ! చూడండి వాస్తునమ్మకం ఎన్ని కష్టాలు తెచ్చిపెట్టిందో!" అంది మాలిని.

"ఇటువంటి మూఢనమ్మకాలు అన్ని వర్గాల్లో పెరుగుతున్నాయి. పైగా వీళ్ళు వాస్తు మీద నమ్మకం లేనివాళ్ళకు ఉచిత సలహాలు పారేస్తూ వాళ్ళ తలకాయలను తినేస్తుంటారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో మరో దృశ్యాలు కన్పిస్తాయి. వాటిని గురించి ఎన్నో మనం పత్రికల్లో కూడా చదువుతుంటాం కూడా. గుప్తనిధి దొరుకుతుందనో, పురుష సంతానం కావాలనో, దేవతకు జాతరలోనో పిల్లల్ని నరబలి ఇవ్వటం ఇంకా జరుగుతున్నదంటె మనం సిగ్గుపడాల్సిన విషయం. సాంకేతికంగా మనం మరీ వెనుకబడి ఏం లేము. అభివృద్ధిని సాధించాం. కాని ఆ శాస్త్రసాంకేతిక విజ్ఞానంతో గ్రామీణులను సామాన్యజనులను చైతన్యవంతులను చేయలేకపోతున్నాం" అన్నాన్నేను. కాస్సేపాగి మళ్ళీ – "ఇటువంటి నమ్మకాలే కాదు ఆంటీ. ఆరోగ్యం విషయంలో కూడా సామాన్య జనులకున్న అపోహలను మూఢనమ్మకాలను తొలగించే కృషి మనం చేయటంలేదు. లక్షల జనం ఒకేసారి స్నానాలు చేయడం వల్ల కాలుష్యమైన నదినీళ్ళలో ఏవో మహత్యాలుంటాయని, చర్మవ్యాధులు పోతాయని అనుకుంటున్నారు. ఆడవాళ్ళు ముఖ్యంగా మెనోపాజ్ వంటి సమయాల్లో అనుభవించే వేదనను తెలుసుకోలేకపోతున్నారు. కుటుంబంలోని పరిస్థితుల ఒత్తిడితో వాళ్ళ శరీరంలో మనస్సుల్లో ఏం మార్పులు వస్తున్నాయో తెలుసుకోలేకపోతున్నారు. అట్లా కలిగే అలజడులను చేతబడులు దయ్యాలు భూతాలని అనుకొని నమ్ముతారు. మంత్రగాళ్ళను ఆశ్రయిస్తారు" అన్నాన్నేను.

"అదే నేనంటున్నాను అంటీ! రేడియో టీవీలు సినిమాలు వంటి బలమైన ప్రచార సాధనాలున్నాయి మనకు. ఇప్పుడు టీవీని చాలామంది గ్రామాల్లో కూడా చూస్తున్నారు. ఆ టీవీ మాధ్యమంతో మనం జనాన్ని మూఢనమ్మకాల విషయంలో చైతన్యవంతులను చేయొచ్చుకద! చేయటమేమోగాని పిచ్చిపిచ్చి కథలతో ధారావాహికలతో జనంలోని మూఢనమ్మకాలను ఇంకా పెంచి పోషించేస్తున్నారనే చెప్పాలె!" అంది మాలిని ఆవేశంగా.

"నువ్వు అనేది నిజం మాలినీ! సామాన్య జనానికి జ్ఞానం విజ్ఞానం అందించే ప్రోగ్రామ్‌లు టీవీ సినిమాల్లో ఏం వస్తున్నాయి? పైగా పాములనీ, దయ్యాలనీ, భూతాలనీ ప్రజల మూఢనమ్మకాలను ఇంకా పెంచేస్తున్నారు. ఇప్పుడు చూడు! గ్రామీణుల్లో చేతబడుల మీద బాగా నమ్మకాలున్నాయి. మంత్రతంత్రాలతో చేతబడులు చేసి ఇతరులకు అంటె తమకు శత్రుత్వం వున్న వాళ్ళను బాధిస్తారని, చంపుతారని గ్రామాల్లో, పట్నాల్లోనూ నమ్ముతారు. అటువంటివేవీ లేవని ఒకొకసారి ఎదుటివాళ్ళను భయపెట్టటానికి చేసే చిట్కాలని లేదా అంతా బూటకమని ప్రజల్లో ప్రచారం జరగాలి. వాళ్ళని ఎడ్యుకేట్ చేయాలి. కాని మన టీవీల్లో అన్నీ సినిమాల, సినిమాతారల సమాచారాల ప్రోగ్రామ్‌లేగాని ఇటువంటి ఎడ్యుకేట్ చేసే ప్రోగ్రామ్‌లే లేవని చెప్పాలె!" అన్నాన్నేను. నా ఉపన్యాసాన్ని మాలిని శ్రద్ధగానే వింది.

"అవును అంటీ! మీరనేదే నా అభిప్రాయం. ఎంతోమంది సామాజిక ఆర్థిక కుటుంబ సంబంధమైన ఒత్తిడులతో మానసిక రుగ్మతలకు లోనవుతారు. అవి మానసిక రుగ్మతలని సామాన్యులు గుర్తించరు. ఏదో మంత్ర తంత్రాలు, చేతబడులని మంత్రగాళ్ళ చుట్టూ తిరుగుతారు. అంటె అసలు విషయం తెలియక మూఢనమ్మకంలో జనం ఆరోగ్యం డబ్బు కోల్పోతున్నారు" అంది మాలిని చాలా విచారంగా.

"అవును మాలినీ! ఇటువంటి మానసిక రుగ్మతలను గురించి జనసామాన్యానికి తెలియజేయాలె. అటువంటి యంత్రాంగం, సమాజసేవా సంస్థలు వుండాలె. మానసికమైన రుగ్మతలు బలహీనతలు, శారీరకమైన రుగ్మతలను గురించి ప్రజలకు సంపూర్ణ అవగాహనను కలిగిస్తే మన మూఢనమ్మకాల్లో చాలావరకు తొలిగిపోయేవి మాలినీ!" అన్నాన్నేను.

"అంటీ మీరన్నది నిజం! మన దేశంలో మానసిక వైద్యులు తక్కువేమో అని అనిపిస్తుంది. అంతెందుకు పట్నంలోనే మానసికవైద్యులు అందరికీ అందుబాటులో లేరు. ఎక్కడో ఏ కొద్దిమందికో వుంటారు. వాళ్ళను చేరుకునే దారి తెన్ను తెలియదు. తెలిసినా బోలెడు ఫీజులు. ఇంకోటి ఏమిటంటె మానసిక వైద్యుని దగ్గరికి ఏ సమస్యతోనైనా వెళ్ళటం అంటె వీళ్ళకేదో పిచ్చి పట్టిందని నలుగురు హేళన చేస్తారేమోనని జంకుతారు." అంది మాలిని.

"అవును మాలినీ! నువ్వనేది నిజమే! ఒకటి మానసిక వైద్యం మనకు కావలసినంత అందుబాటులో లేదు. అటువంటి వైద్యుల దగ్గరికి ఏ సమస్యలతో వెళ్ళవచ్చునన్న విషయం చాలామందికి తెలియదు. అట్లా తెలిస్తే ఎన్నో మూఢనమ్మకాలు మనలో నుంచి తొలగిపోతాయి. అంతేగాక మానసిక రుగ్మతలతో తలెత్తే రోగాలెన్నో ముందే నయమవుతాయి. మానసిక వైద్యులు ఇతర వైద్యుల్లాగా జనానికి అందుబాటులో వుండాలె!" అన్నాన్నేను దృఢంగా.

తీర్పు

యాసలపు సూర్యారావు

ధర్మపురం రాజు విజయసేనుడు. ముందుచూపు లేనివాడు. తనకు తోచిందే ధర్మమనుకుంటాడు. తనకు ముందుగా ఫిర్యాదు చేసిన వాళ్లకే అనుకూలంగా తీర్పు చెప్తాడు.

భూపాల్ ఆ రాజ్య పౌరుడు. గుర్రపు బండిని నడుపుకొని జీవిస్తున్నాడు. ఒకరోజు భూపాల్ ప్రయాణీకులను ఎక్కించుకుని తన గుర్రపు బండిని తోలుకెళ్తున్నాడు. దారిలో వంతెన దాటాల్సి వచ్చింది. వంతెన దాటించే ప్రయత్నంలో వున్న భూపాల్ దారికి ఎదురువస్తున్న పిల్లవాణ్ణి చూశాడు. ఆ వంతెన మీద నుండి బండిగానీ, మనిషిగానీ ఎవరో ఒకరు మాత్రమే వెళ్లడానికి వీలవుతుంది. అప్పటికే బండి సగం వంతెన మీదకి వచ్చేసింది. వెనక్కి వెళ్లే వీలులేదు. ఆ పిల్లవాణ్ణి వెనక్కి వెళ్లమని గొంతు చించుకొని అరుస్తున్నా వినట్లేదు. అలాగే ముందుకు వస్తున్నాడు. బండిని కాస్త అటూ ఇటూ తిప్పదామంటే అందులో వున్న ప్రయాణీకులతోపాటు తాను కూడా నీటిలో పడి ప్రాణాలు కోల్పోవాలి. లేదూ అంటే పిల్లవాడు చనిపోతాడు. భూపాల్‌కి ఏం చేయాలో తోచలేదు. ప్రయాణీకులు కూడా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని కూర్చున్నారు. చూస్తుండగానే భూపాల్ బండి పిల్లాడి పైనుండి వెళ్లిపోయింది. అతను చనిపోయాడు. 'పిల్లవాడి మృతికి కారణమయ్యానే' అన్న బాధతో భూపాల్ తల పట్టుకుని విచారించసాగాడు. విషయం తెలిసి జనమంతా అక్కడకు చేరారు. చనిపోయిన అబ్బాయి మూగ, చెవిటి అని భూపాల్‌కి అప్పుడే తెలిసింది. పిల్లవాడి తల్లి గుండెలవిసేలా ఏడ్చింది. చనిపోయిన బిడ్డను ఎత్తుకొని తిన్నగా రాజుగారి దగ్గరకు వెళ్లింది.



రాజుగారికి బిడ్డను చూపించి, తనకు న్యాయం చేయమని కోరుకుంది. వెంటనే భూపాల్‌ని పిలిపించాడు రాజు. అతనితోపాటు ప్రయాణీకులు కూడా వచ్చారు. అప్పటికప్పుడు సభ ఏర్పాటుచేయబడింది. భూపాల్ వంతెన దగ్గర ఎదురైన పరిస్థితిని, ఐదుగురి ప్రాణాలు కాపాడటానికి తాను చేసిన ప్రయత్నాన్ని రాజుకు వివరించాడు. అతను చెప్పిన దాంట్లోని యదార్థాన్ని గ్రహించాడు రాజు. కానీ తీర్పు చెప్పలేదు. పైగా సభలో కూర్చున్న ఒక వృద్ధుణ్ణి పిలిచి సమస్యను పరిష్కరించమని చెప్పాడు. మొదట తటపటాయించినా రాజుగారి ప్రోద్బలంతో ముందుకు వచ్చాడు.

"ప్రభూ! నాకు తెలిసిన మేరకు చెప్తున్నాను. ఇందులో బండివాడిది ఎలాంటి తప్పు లేదు సరికదా తన తెలివితేటలతో, అతనితోపాటు మరో నలుగురి ప్రాణాలు కాపాడాడు. తనకు జీవనాధారమైన గుర్రాన్ని, బండిని కాపాడుకున్నాడు. మరో పక్క ఆ బాలుడు మూగ, చెవిటివాడు కావటం చేత ఎంత పిలిచినా అతనికి వినిపించలేదు. కాబట్టి దాంట్లో అతని తప్పు కూడా లేదు. ఇకపోతే...." అని సంశయించాడు వృద్ధుడు.

"ఎందుకు సంశయం? ధైర్యంగా చెప్పు..." అన్నాడు రాజు.

"ప్రభూ! అక్కడ వంతెన ఇరుకుగా వున్న కారణంగా అనేక ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. అందువల్ల దాని స్థానంలో పెద్ద వంతెనను నిర్మించమని ప్రజలు ఎన్నోసార్లు మీకు విన్నవించుకున్నారు. కానీ మీరు పట్టించుకోలేదు. మీరే గనుక వెంటనే వంతెన కట్టి వుంటే ఈ ప్రమాదం జరిగి వుండేది కాదు. కాబట్టి బిడ్డను కోల్పోయిన తల్లికి జీవితాంతం బతకడానికి అవసరమైన ఉపాధిని కల్పించండి. ఒక ప్రాణం పోయినా, ఐదుగురి ప్రాణాలు కాపాడిన బండివానికి తగిన బహుమతి ఇస్తే బావుంటుంది" అన్నాడు.

మునలాయన చెప్పిన దానికి ముగ్ధుడైన రాజు ఆ తల్లికి తన కోటలో పని కల్పించాడు. వృద్ధాప్యంలోనూ ఆమెకు ఎలాంటి లోటూ రాకుండా చూసుకుంటానని సభాముఖంగా హామీ ఇచ్చాడు. భూపాల్‌కి కొత్త బండి, మంచి గుర్రాలను కొనుక్కోవడానికి ధన సహాయం అందచేస్తానని చెప్పాడు. మంచి తీర్పు చెప్పిన ముసలాయనకు కొంత ధనమిచ్చి సంతోషపెట్టాడు. వెంటనే పాత ఇరుకు వంతెన స్థానంలో పెద్ద వంతెన కట్టించాడు.



చిన్నారి చిత్రకారులు



కె.జెప్రిన్స్, రాహుల్ పబ్లిక్ స్కూల్,
6వ తరగతి, జడ్‌పిహెచ్‌స్కూల్,
చందర్లపాడు.

కుర్మా భానుప్రకాష్, 6వ తరగతి,
యంపియుపి స్కూల్,
బ్రహ్మపురం, కృష్ణా.



ఎం.డి.అర్‌బాస్ అలీ, 2వ తరగతి,
రాయల్ ఎంబసీ హైస్కూల్, హైదరాబాద్.





కె.గణేష్, 4వ తరగతి,
ఆంధ్ర పబ్లిక్ స్కూల్,
హరిపురం, విశాఖ.



శరవణ్,
6వ తరగతి,
రాహుల్ పబ్లిక్ స్కూల్,
చీరాల, ప్రకాశం.

వి'చిత్రం'



చిన్నారులూ! పైన ఓ అద్భుతమైన చెట్టు వుంది చూశారా! అందులో పది మంది రాజకీయ నాయకులు వున్నారు. గమనించారా? వారు ఎవరు? ఈ చెట్టుకు ఎక్కడ వున్నారు? అనేది చెప్పాల్సింది మాత్రం మీరే. ఇప్పటికే ఆ పనిలో వున్నట్టున్నారే. ముందు ప్రయత్నించండి. తెలీకపోతే మాత్రం మీ స్నేహితులకు, పెద్దవాళ్లకు పని పెట్టండి. సరేనా!

దారి కనుక్కుందామా!

Start



Finish

పాపం ఎలుకగారికి తన నేస్తం దగ్గరనుంచి ఒక ఉత్తరం వచ్చింది. కానీ అది గజిబిజి దారులకు అవతల వుండిపోయింది. దీనికేమో ఆ లెటర్ చదివి తిరుగు ఉత్తరం రాయాలని ఆతృతగా వుంది. అందుకే పెన్సిల్, కవర్ రెడీ చేసుకుని పెట్టుకుంది. కానీ ఆ ఉత్తరాన్ని చేరే దారే తెలీలా. బుజ్జి ఎలుకకు మీరేమన్నా సాయం చేస్తారా!

సర్కస్! సర్కస్!!

S	C	A	L	L	I	O	P	E	F	F	S
J	H	X	S	A	C	T	S	S	T	O	T
S	Y	O	X	T	U	H	R	S	R	S	R
T	A	L	W	A	N	I	Z	J	A	R	A
E	W	M	A	S	N	A	Q	D	P	E	I
K	D	R	O	E	B	S	H	B	E	G	N
C	I	W	V	I	C	H	L	P	Z	I	E
I	M	U	G	L	Z	U	O	E	E	T	R
T	O	T	O	S	G	N	I	R	M	L	A
S	O	W	E	L	G	G	U	J	S	A	E
P	N	U	G	N	I	G	G	I	R	E	C
S	Q	Z	S	N	O	O	L	L	A	B	S

ఇంగ్లీషు పజిల్-5

హాయ్ం! మీరు ఎప్పుడైనా సర్కస్‌కు వెళ్లారా? వెళ్లడమేంటి? చాలా బాగా ఎంజాయ్ చేశారా? మరయితే పైన కొన్ని ఆంగ్ల అక్షరాలు వున్నాయికదా. అందులో సర్కస్‌కు సంబంధించిన 18 పదాలు వున్నాయి. అవి ఎక్కడెక్కడ వున్నాయో గుర్తించాల్సిన పని మాత్రం మీదే. మీరు కనిపెట్టిన పదాలను కార్డుమీద రాసి మాకు పంపండి. ఎక్కువ పదాలను వెతికి పట్టుకున్న వారి పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: **ఇంగ్లీషు పజిల్, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.**



పజిల్-4 సమాధానం

BEIGE	GREEN	PURPLE
BLACK	INDIGO	RED
BLUE	OLIVE	TAN
BROWN	ORANGE	VIOLET
CYAN	PEACH	WHITE
GRAY	PINK	YELLOW

పజిల్-3కు సమాధానాలు రాసినవారు

ఎం.ఇందు, 5వ తరగతి, డిఎవి బిడిఎల్ పబ్లిక్ స్కూల్, మెదక్. **సి.విమలాదేవి,** 5వ తరగతి, అరండల్‌పేట, గుంటూరు. **ఎం.కవిత,** 9వ తరగతి, **ఎం. కనకారావు,** 4వ తరగతి, దర్శి, ప్రకాశం. **పి.పద్మలత,** 5వ తరగతి, ఇంకొల్లు, ప్రకాశం. **బి.వెంకటేశ్వరరావు,** 7వ తరగతి, వైరా. **ఎం.సత్తిరాజు,** 6వ తరగతి, మున్సిపల్ స్కూల్, వినుకొండ.

హంస-కాకి

ఉజ్జయినీ నగరానికి వెళ్లే దారిలో ఒక పెద్ద రావి చెట్టు వుంది. ఆ చెట్టు మీద ఒక కాకి, హంస కాపురముంటున్నాయి. కాకి దుర్గుణాలు హంసకు నచ్చేవికావు. కానీ ఒక చోట వుంటున్నందున కాకితో స్నేహంగానే ప్రవర్తించేది.

ఒకరోజున ఓ బాటసారి ఉజ్జయినీ నగరానికి వెళ్తూ అలసట వల్ల ఆ చెట్టు కింద విశ్రమించాడు. ఎండలో చాలా దూరం నుండి నడిచి వచ్చినందువల్ల ఆ బాటసారి వెంటనే నిద్రపోయాడు. కొంతసేపటికి సూర్యుడు పడమటి దిక్కున వాలగా అతని ముఖంపై ఎండ పడసాగింది. ఆ ఎండకు సరిగా నిద్రపట్టక అతను అటూ ఇటూ మెదలసాగాడు. అతని అవస్థ చూసి హంస జాలిపడింది. అతనిమీద ఎండ పడకుండా రెక్కలు చాపి ఒక చెట్టు మీద కూర్చుంది. దాని రెక్కల నీడలో బాటసారి హాయిగా నిద్రపోయాడు.

బాటసారి సుఖనిద్ర చూసి ఓర్వలేని కాకి కొమ్మ పైనుండి కిందకు దిగి అతని ముఖంపై రెట్టవేసి పారిపోయింది. రెట్ట ముఖం మీద పడటంతోనే బాటసారి ఉలిక్కిపడి లేచి కొమ్మ మీద వున్న హంసను చూశాడు. అదే రెట్ట వేసి వుంటుందని ఆ బాటసారి ఉగ్రుడై దానిని బాణంతో కొట్టాడు. హంస బాణం దెబ్బకు విలవిల్లాడుతూ నేలకూలింది' అంటూ కథ ముగించాడు అరుణముఖుడు. అంతటితో ఆగక "మహారాజా! దుర్బుద్ధి గల కాకితో స్నేహం చేసిన హంస బతుకు ఏమయ్యిందో విన్నారు కదా!" అన్నాడు. చిత్రవర్ణుడు దాని మాటలకు, "అవును!" అన్నట్టు తల ఊపాడు. పైగా దీర్ఘముఖుణ్ణి ముందు



వెళ్లమని ఆ వెనుక తమ దూత వస్తాడని చెప్పాడు.

దీర్ఘముఖుడు ఈ విషయాలన్నీ హిరణ్యగర్భునికి చెప్పి బాధపడ్డాడు. దాంతో హంసరాజుకు బాగా కోపం వచ్చింది. యుద్ధానికి సిద్ధం కమ్మని తన అనుచరులకు చెప్పాడు. హిరణ్యగర్భుని సేనలు, చిత్రవర్ణుని సేనలు హోరాహోరీగా యుద్ధం చేశాయి. ఎన్నో పక్షులు చనిపోయాయి. మరెన్నో గాయపడ్డాయి. యుద్ధ రంగమంతా రక్తంతో తడిసిపోయింది.

'చీకటి పడటంతో పక్షులు యుద్ధం ఆపాయి. అవన్నీ ఆదమరచి పడున్నాయి. ఇదే సమయమనుకున్న నీలవర్ణుడనే దుష్ట కాకి కోట ద్వారాలను మూసివేశాడు. తర్వాత కోట నలువైపులా నిప్పపెట్టి పారిపోయాడు. ఆ మంటలకు లోపలి పక్షులెన్నో కాలి చనిపోయాయి. హిరణ్యగర్భుడు కొన్ని పక్షులతో తప్పించుకుని పారిపోయి ఒక మడుగులో దూరాడు. చిత్రవర్ణుడు తన సేనలతో అక్కడకు వచ్చి హిరణ్యగర్భుడితో యుద్ధం చేశాడు. ఇరువురికీ తీవ్రంగా గాయాలయ్యాయి. హిరణ్యగర్భుడు చనిపోయాడు. చిత్రవర్ణుడు తన సేనలతో కర్పూరద్వీపంలోని సంపదనంతా దోచుకుని జంబూద్వీపానికి వెళ్లిపోయాడు'.

విష్ణుశర్మ ఈ కథ చెప్పి 'రాకుమారులారా! విగ్రహం అంటే యుద్ధం. దీనివలన ఎన్ని నష్టాలున్నాయో తెలిసిందికదా. ఎంత దు:ఖాన్ని తెచ్చిపెట్టిందో చూశారుగా. తెలివైన వారు స్నేహంతో, సామరస్యంతో సహజీవనం జరుపుతారు. అందువల్ల మీరు పొరుగురాజులతో స్నేహంగా వుంటూ సుఖజీవనం చెయ్యండి' అన్నాడు. రాకుమారులు చిరునవ్వుతో అలాగేనన్నట్టు తలలూపారు.

(అయిపోయింది)



చేపపిల్ల

సాయంత్రం నాలుగు గంటలైంది.

నలంద విద్యానికేతన్ స్కూలు బస్సు నెమ్మదిగా ఆగింది. పిల్లలంతా కిలకిలమంటూ కిందకు దిగారు. చిన్న చిన్న స్కూలు బేగులు తగిలించుకుని కేరేజీలను ఊపుకుంటూ దిగి ఇళ్లవైపు నడక మొదలుపెట్టారు.

ఎదురుగా ఉన్న ఇంట్లోంచి దుర్గ ఎదురుచూస్తోంది.

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

ప్రతిరోజూ నాలుగు గంటలకు బస్సు హారన్ వినిపించడం... వెంటనే బైటికి రావడం.. అయిదేళ్ళ ముద్దుల కూతురు వెన్నెం జ్యోతి సురేఖ కోసం ఎదురుచూడటం ఆమెకు నిత్యకృత్యం.

దూరంగా స్కూలు డ్రస్సులో సురేఖ కనిపించగానే దుర్గ కళ్లల్లో మెరుపులు మెరిసాయి. ఇంటి ముందు నిల్చున్న తల్లిని చూసి పరుగు పరుగున వచ్చేసింది.

మెల్లగా నడిపించుకుని లోపలకి తీసుకువెళ్లింది.

తల్లిని అనుసరిస్తూ ఆ రోజు స్కూల్లో జరిగిన సంగతులన్నీ వసపిట్టలా సురేఖ ఏకరువు పెడుతుండగా గ్లాసుతో పాలు ఇచ్చి తాగించింది.

అరగంట తర్వాత ఫోను వచ్చింది.

"వెన్నెం సురేంద్రగారు ఉన్నారా?" శాంతి సక్సేనా అడిగారు. అతని గొంతును పోల్చిన దుర్గ – "నమస్తే సార్! సురేంద్రగారు ఇంకా ఇంటికి రాలేదు. ఏమిటి విశేషాలు?" అని అడిగింది.

"ఏం లేదు. సురేఖ ఈత పోటీలకు వెళ్లవలసి ఉంది. ఆ విషయం చెప్పడానికే ఫోను చేశాను" అన్నాడు. గత ఏడాది కాలంగా ఈత నేర్పించే కోచ్‌గా ఉంటున్న శాంతి సక్సేనా వద్ద సురేఖ ఈత నేర్చుకుంటోంది. ఈతలో రకరకాల మెలుకువలు నేర్చుకుంది. సెలవు రోజు వచ్చిందంటే చాలు గంటల తరబడి నీళ్లలో ఉండిపోతుంది.

ఆలోచనల నుండి తేరుకున్న దుర్గ – "అదేంటి సార్! పాపకు ఇంకా అయిదేళ్లు కూడా నిండలేదు. అప్పుడే పోటీనా?"

"అవును దుర్గగారూ! పోటీలో పాల్గొంటున్న వారందరూ మన సురేఖ లాంటి పిల్లలే.... అందరిలోనూ మనపాప విశిష్టత కలిగినది గాబట్టి తప్పనిసరిగా గెలుపొందుతుంది.... మనందరికీ మంచిపేరు తీసుకువస్తుంది.. ఇంతవరకూ ఈతలో నేను నేర్పించిన విషయాలు పాప చొరవను చీఫ్ కోచ్ సాంబశివ రావుగారు కూడా గుర్తించారు..." అన్నాడు.

"సురేంద్రగారు రాగానే చెబుతాను... మిమ్మల్ని కాంటాక్టు చేస్తారు!" అంది దుర్గ.

తల్లి ఫోనులో మాట్లాడుతున్న విషయాలు అర్థం కాకపోయినా "ఏమిటి మమ్మీ" అని అడిగింది.

"ఏవో ఈతల పోటీలు జరుగుతున్నాయట. మీ కోచ్ నిన్ను పాల్గొవాలని ఫోన్ చేశారు!" అంది.

"థ్యాంక్స్ మమ్మీ! నేను నేర్చుకున్న ఈత ద్వారా ఎంత దూరమైన నీటిలో పోగలను!" అంది ఆరిందలా.

దుర్గ కూతుర్ని దగ్గరికి తీసుకుంది.

* * *

విజయవాడ వద్ద ప్రకాశం బ్యారేజి.

కృష్ణానది ప్రశాంతంగా ఉంది.

2001 జూన్ 11వ తేదీ.

ఆకాశం నిర్మలంగా ఉంది.

ఈతల పోటీలో పాల్గొనడానికి వచ్చిన పిల్లలందరూ స్విమ్మింగు డ్రస్సుల్లో హుషారుగా ఉన్నారు. పిల్లలతో వారి తల్లిదండ్రులు అన్నదమ్ములు ఆ ప్రాంతానికి చేరుకున్నారు.

జ్యోతి సురేఖను తల్లిదండ్రులు దుర్గ సురేంద్రలు దగ్గరుండి తీసుకువచ్చారు. భయపడవద్దని పదే పదే అనునయించారు. ఉత్సాహంగా ఈత డ్రస్సు వేసుకుంది.

"ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణానదికి అవల ఉన్న మోటెల్ నుంచి ఇవతల ఉన్న దుర్గాఘాట్ వరకూ మూడు ట్రిప్పులు ఈదాలి. ఈ విధంగా చేయడానికి అందరూ సంసిద్ధులై ఉండాలి. మీ వెనుక పడవలపై మనుషులు ఉంటారు. ఎటువంటి భయం లేదు. అలసిపోయి మరి ఈదలేమని అనిపిస్తే చేతులు ఎత్తితే పడవలోనికి ఎక్కిస్తారు. ధైర్యంగా ఈత కొట్టండి!" నిర్వాహకులు ఎనౌన్సు చేశారు.

ఈ విషయాన్ని పోటీలకు వచ్చిన పదేళ్ళలోపు పిల్లలందరికీ వారి తల్లిదండ్రులు మరొకసారి విడమరచి చెప్పారు.

సురేంద్ర కూతుర్ని దగ్గరికి తీసుకుని "రేఖా నీమీద ఎంతోమంది నమ్మకం పెట్టుకున్నారు. అందరిలోనూ చిన్నపిల్లవు నువ్వే. పిట్టకొంచెం కూత ఘనం అనిపించాలి!" కోరాడు.

సురేఖ తల ఊపింది.

ఉదయం 9.10 గంటలకు పోటీలు ప్రారంభమయ్యాయి. విజయవాడ మేయర్ పి. అనూరాధ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు.

పిల్లలందరూ కృష్ణానదిలో చేపపిల్లల్లా గెంతి ఈదుకుంటూ ముందుకు సాగిపోయారు. ఒకరిని అధిగమించాలని మరొకరు పోటీపడి ఈత కొట్టారు. కొంత దూరం వెళ్లేసరికి చాలామంది పిల్లలు అలసిపోయారు.

నిర్ణయించిన దూరంలో రెండొంతులు ఈదడానికి 1.56 నిమిషాలు పట్టింది. మూడవ రౌండుకు పిల్లలు ఎవరూ మిగలలేదు. సురేఖ మాత్రం చేపపిల్లలా ముందుకు సాగిపోయింది. అనుసరిస్తున్న పడవపైన వ్యక్తులు ఆమెకు గ్లూకోజ్ ఇచ్చారు. డాక్టర్లు పరీక్షించారు.

ఏమాత్రం అలసట, ఆందోళన మొహంలో కనిపించకుండా తొణక్కుండా, బెణక్కుండా మూడవ రౌండు మొదలుపెట్టి 1.30 నిమిషాల్లో నిర్ణయించిన దూరాన్ని దాటింది.

జ్యోతి సురేఖ ఈత సామర్థ్యం చూసి హర్షధ్వానాలతో అభినందనలతో ముంచెత్తారు. మొత్తం మూడు రౌండ్లను మూడు గంటల ఆరు నిమిషాల ఇరవై సెకండ్లలలో పూర్తిచేసినట్లు నిర్వాహకులు నమోదు చేశారు. అంతకుముందు పిల్లల విభాగంలో జరిగిన అన్ని పోటీలలో రికార్డులన్నీ అధిగమించినట్లు గుర్తించారు. ఈతలో ఉండే ఫ్రీస్టయిల్, బటర్ ఫ్లై, బ్రెస్టు స్విమ్ములలో అవలీలగా ఈదినట్లు అభినందించారు. ఇంతవరకూ అయిదేళ్లలోపు పిల్లలెవరూ ఇటువంటి సాహస ప్రయత్నాన్ని చేయలేదని పొగడ్తలతో ముంచెత్తారు.

జ్యోతి సురేఖ ఈత రికార్డులను గిన్నీసు బుక్కు లిమ్కా బుక్‌లలో కూడా నమోదు చేశారు.

* * *

నలంద పాఠశాల.

విద్యార్థులందరితో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. చాలామంది తల్లిదండ్రులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. పాఠశాల సిబ్బంది అందరూ తమ తమ సీట్లలో కూర్చున్నారు.

జ్యోతి సురేఖ కృష్ణానదిలో ఈతకొట్టి అతి చిన్నతనంలో ఎవరూ సాధించలేని అరుదైన రికార్డును

స్వంతం చేసుకున్నందుకు ఆ బాలికను అభినందించడానికి ఆ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

సురేఖతో పాటు తల్లిదండ్రులు దుర్గ, సురేంద్రలు కూడా హాజరయ్యారు.

సమావేశాన్ని ప్రారంభించారు.

ఈత పోటీల గురించి వివరించి జ్యోతి సురేఖ సాధించిన విజయాన్ని విద్యార్థులందరకీ వివరించారు. ఒకొక్కరు ఆమె సాధించిన విజయాన్ని ఏకరువు పెట్టారు. పాఠశాల తరుపున ప్రిన్సిపాల్ మెమెంటోను బహూకరించగా టీచర్లు అభినందనలతో ముంచెత్తారు.

ఎల్.కె.జి. స్థాయిలో ఉన్న బాలిక కృష్ణానదిని ఈదడం ఎంత గొప్ప విషయమో తెలియడంతో అక్కడికి వచ్చిన పిల్లలందరూ ఆనందంతో కేరింతలు కొట్టారు.

చివరగా సురేఖను మాట్లాడమని మైకు అందించారు. ఏమి చెబుతుందా అని దుర్గ, సురేంద్రలు కూడా ఆసక్తిగా వింటున్నారు.

"నాకు నీళ్లంటే ఇష్టం.. నీళ్లలో గెంతడం చూసి మా మమ్మీ డాడి నాకు ఈత నేర్పించారు. వారిద్దరి ఉత్సాహం... నేను ఈదేలా చేసింది. ఇంకా ఈదుతాను. అన్ని నదులనూ ఈదేస్తాను... చదువులో మంచిపేరు తెచ్చుకుంటాను. ఈతలో అందరి మెప్పు ఎలా పొందానో చదువులోనూ అలాగే పొందుతాను!" అంది.

కూతురు మాటలు వింటుంటే దుర్గకు సురేంద్రకు కళ్లు చెమ్మగిల్లాయి. వారిలో పుత్రికోత్సాహం వెల్లుబికింది.

'కో బలీ... కో బలీ'

(9వ పేజీ తరువాయి)

పిలిచాడు పుల్లన్న.

పుల్లన్న మాటని జవదాటని కంబగిరి తిన్నగ వచ్చి కట్టమీద పుల్లన్నకెదురుగానే కూర్చున్నాడు. ఇద్దరూ పులిజూదమాడ్తూ తలలు కిందికొంచుకొని ఆటలోనే నిమగ్నమయ్యారు.

అంతలోనే "కో బలే...కో బలే".. అనే కేకలు వినపడి, దిగ్గున తలలు పైకెత్తి చూశారు, ఎదురుగా కిష్టప్ప ఆగ్రహంగ కళ్ళెర్ర జేస్కోని నిలబడి, "రేయ్! నరకండ్రా" అని అనుచరులని ఉసిగొల్పి వేట కొడవలితో పుల్లన్న తలమీద నరికాడు. ఆ అరుపులకి కోరస్ పలుకుతున్నట్లుగా వెంకట్రాముడు, నాగరాజు, అంజీ, ఓబిలేసు, నర్సింలు, కూడ గట్టిగ కేకలేస్తూ "కో బలే..కో బలే.." అని అరుస్తూ కంబగిర్ని చిత్తు చిత్తుగ నరికారు, ఒక్క క్షణంలో వాళ్ళిద్దరి ప్రాణాలు అనంతవాయుల్లో కలిపి "కో బలే...కో బలే".. అని గట్టిగ అరుచుకుంటూ అక్కడ్నుంచి పారిపోయారు.

రక్తపు మడుగులో పడున్న ఆ ఇరువురి శవాలని చూడగానే బంధువులంతా భోరున విలపిస్తూ ఆగ్రహంగా రంకెలేసినారు. తండ్రి శవాన్ని చూడగానే "యానా కొడుకురా.. మా నాయన్ని చంపింద"ని జనాన్ని ప్రశ్నించాడు పుల్లన్న కొడుకు ప్రభాకర. సంఘటనను కళ్ళారా చూచిన ఆ ఇద్దరాడాళ్ళు, చూసింది చూచినట్లు చెబుదామంటే – నోరు పెగల్లేదు. గుమిగూడిన గుంపుని ఛేదించుకొని, ముందుకొచ్చిన పిల్లలు "అన్నా! ఆ ఎరికిలోళ్ళా యప్ప... కిట్టప్పా, ఆయప్పల్లుడు తోకోడంటారు. చూదు ఆ యప్ప సందులో సంజప్ప కొడుకు ఎంగట్రాముడు, ఆయప్ప బామర్ది నాగరాజు, మాదిగోళ్ళ నర్సింలు తప్పెట కొట్టే ఓలేసు, వాళ్ళే అన్నా... పెద్ద నాయన్ని, కంబగిరి మామని నరికి నరికి చంపి... అద్దో అట్ల పరిగెత్తినార"ని ఆత్రంగ ఆయాస పడ్తూ చెప్పారు.

ఆ మాటవినగానే నిలువెల్లా వణికారు. ఊరిజనాలు. పుల్లన్న భార్యా... అతని కూతురు, కంబగిరి భార్యా అతని తల్లి అమ్మతండ్రో ఎంతపని జరిగిందని గట్టిగ అరిచి స్పృహ తప్పికూలిపోయారు. ఆడవాళ్ళు ఏడుపులతో మగవారి అరుపులతో, ఆ క్షణం ఆ ప్రాంతమంత దద్దరిల్లింది. శవాలపై పడి బంధువులంతా బిగ్గరగా రోదిస్తున్నారు. విషయం తెల్సుకున్న రంగారెడ్డి పంచె ఎగ్గట్టి బిరా బిరా నడ్చుకుంటూ వచ్చి ఎవడ్రా! ఈళ్ళని చంపింద? ఆగ్రహంతో రంకేసినాడు. ఎరికల వీధి మీదికి దాడికి పిలిచాడు. "ఎరికల గుడిసెలు కాల్చండి, వడ్డొళ్ళ కొంపలు కూల్చండి, మాదిగొల్ల కొట్టాలు పీకిపారేయండి. ఎవరొత్తారో చూద్దాం"టూ పలికిన రంగారెడ్డి మాటలకి రెచ్చిపోయి, ఆ ప్రాంతమంతా భస్మీపటలం చేసినారు. భూకంపానికి కూలిపోయి శిథిలమైనట్లుందా ప్రాంతం. సి.ఐ.శివరాం, భారీ పోలీసు బలగాలతో ఊర్లోకొచ్చాడు. జనాల్ని చెదరగొట్టి సెల్‌ఫోన్ ద్వారా ఫైర్ స్టేషన్‌కి ఫోన్ చేసి హత్యకేసు నమోదు చేస్కున్నాడు. హతుల ఆర్తనాదాల మధ్య శవాలని పోష్టుమార్టంకి తరలించాడు. కొద్దిమంది పోలీసు కానిస్టేబుళ్ళతో, ఊర్లో పోలీస్ పికెట్ పెట్టాడు,

అబ్బా! పోలీసు హింసలతో ప్రత్యర్థుల దాడులతో ఆ కొన్నాళ్ళు ఎంత నరకం అనుభవించినారా! దేవుడా, అని మనసులో అనుకుంటాండగానే "అమ్మా! హనుమాపురం స్టేజొచ్చింది లేచిరాండి" అన్న కండక్టర్ పిలుపుకి ఉలిక్కిపడి దిగ్గున లేచొచ్చి బస్సుదిగి ఇంటి దారి పట్టింది పుల్లమ్మ. కడుపుబ్బితో రగిలిపోతూ, పరుగు లాంటి నడకతో బిర బిర పోతున్నది. "ఏం పుల్లమ్మత్తా! పాయం పిల్ల మాదిరి బిర బిరాపోతాండావ్. కిట్టప్ప కేసేమైంది?" దారికెదురొచ్చి! అడిగాడు వడ్ల సుబ్బాచారి.

పుల్లమ్మ బిగ్గరగా ఏడుస్తూ, "పోయినారు సామీ! మావాళ్ళు మా మఘాన లేకుండపోయినారు. ఏందో యావజ్జీవ శిచ్చంట, ఆశిచ్చపడినోళ్ళెవ్వరూ ఇప్పుడే బయటికి రారంట" అని బోరున ఏడ్చింది.

"ఎవరు చేస్కోమన్నార్త వీళ్ళకీ కర్మని? ఇదేం మీ ఇంటికొచ్చిన పీకులాటనా ల్యేకుంటే మీ వాకిలికొచ్చిందా? పరుల పీకులాటకి పోయి బతుకులు నాశనం చేస్కున్నారే ఇప్పుడెవ్వరు ఆదుకుంటారు మిమ్మల్ని" కాసింత కోపంతో పలికాదు సుబ్బాచారి,

"అందుకే సామి! రొడ్డి దగ్గరికి పోతాండాను, పై కోర్టులో అప్పీలు చేయమని చెప్పనీకి", మనసులో దాచుకున్న చివరి ఆశని బయటకి చెప్పింది పుల్లమ్మ.

"వాళ్ళేపో ఇప్పుడు మీకు పలికేది" హేళనగ పలికాడు సుబ్బాచారి, "ఏం సామి! అట్లంటాండావ్" ఆత్రంగ అడిగింది.

"చూడత్తా! నిన్న మొన్న వరకు రంగారొడ్డి పుల్లారొడ్డి పగదాయిళ్ళు. ఈ రోజు నుంచి వాళ్ళిద్దరూ వియ్యంకులైతానారు. పుల్లారొడ్డి బిడ్డని, రంగారెడ్డి కొడుక్కిచ్చేకి, ఈరోజు రాత్రి తాంబూలాలు పంచుకుంటున్నార్"ని పిడుగులాంటి వార్త పుల్లమ్మ నెత్తినేశాడు సుబ్బాచారి.

పుల్లమ్మకి గుండె జారినట్టైంది. జారుతున్న గుండెని బలంగ అదిమి పట్టుకొని బిర బిరా ఊర్లోకొచ్చింది. ఇంద్రభవనంలా పుల్లారెడ్డి ఇల్లు చక్కగ అలంకరించుకొని పచ్చని మామిడి తోరణాలతో కళ కళ లాడ్తోంది. ఇల్లంతా బంధువులతో కిటకిలాడ్తొంది. ఇంటి ముందు వసారాలో పుల్లారెడ్డి రంగారెడ్డి ప్రక్కప్రక్కనే కుర్చీల్లో కూర్చొని ఒకరినోట్లో ఒకరు మిఠాయిలు పెట్టుకుంటూ. గలగల నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. ఆ దృశ్యం చూడగానే ఆగ్రహం పట్టలేని పుల్లమ్మ ఆవేశంతో పరిగెత్తి పోయి "నగండి (నవ్వుకోండి) రొడ్డీ! బాగా నగండి, మా బతుకులు భంగం చేసి మీ బతుకుల్ని భద్రం చేస్కుంటాండారు కదా. ... నగండి రొడ్డి. ఇంకా ఎంతకాలం మా బీద బతుకుల్తో మీరు చెలగాటమాడ్తారు. ఊర్లో మీ పదవుల కోసం మీ పెత్తనాల కోసం మా పేగులు తెంచి మీ పేగు బంధం పెంచుకుంటున్నారే... మీకిది న్యాయంగుందా రొడ్డి?" బిగ్గరగ ఏడుస్తూ పుల్లారెడ్డిని నిలదీసి ప్రశ్నించింది పుల్లమ్మ.

దగ్గరికొచ్చి ఏడుస్తున్న పుల్లమ్మని అసహ్యించుకుంటూ "ఏందే. ముసలి ముండా! శుభమా అని ఇంట్లో శుభకార్యం చేస్కుంటాంటే ముండమోపివొచ్చి ఏడుత్తాండావ్ ఇప్పుడేం జరిగిందని అట్లేడుచ్చాండావ్?" విసుగుతో నసిగాడు పుల్లారెడ్డి.

"అవునొడ్డి! మా బతుకులు నాశనమైనప్పుడల్లా మీకన్నీ శుభకార్యలే. మీ పీకులాటకొచ్చి మా వాళ్ళు జైలు శిచ్చ మోస్కోని దీపాంతవాసం పోతాండారు. నువ్వోసారొచ్చి మా వాళ్ళతో మాట్లాడిపోవల్లంట. నువ్వొత్తావని వాళ్ళెంతో ఆశ పెట్టుకున్నారు. ఓసారిపోయి మా వాళ్ళతో మాట్లాడురొడ్డి" అని ఏడుస్తు పలికింది పుల్లమ్మ.

"నేనా.. నేనొచ్చి ఏం.చేయలంట?" తాపీగ పలికాడు పుల్లారెడ్డి. "రొడ్డీ! నువ్వుపోయి పై కోర్టులో అప్పీలు చేయ్యల్లంట" దీనంగ వేడుకుంది

"పై కోర్టుకి పోయినా కూడ ఫలితం లేదు పుల్లమ్మ. ఎందుకంటే సాక్షాలు శానా బలంగుండాయి. సాక్షాలు బలంగుంటే మనమేం చేయలేము. ఊరికే దుడ్లు ఖర్చైతాయిగాని, మీ వాళ్ళు బయటికి రాలేరు. జరిగిందేదో జరిగింది. ఇక మీరు గుండె నిబ్బరం చేస్కోని బతకండి. మేము కూడ ఊర్లో ఎందుకు అనవసరమైన రంపులని కల్పిపోయి బంధుత్వం కలుపుకుంటున్నాము... వాళ్ళే లేనప్పుడు ఊర్లో మీక్కాని ఏం పని? ఎక్కడైనా టౌన్‌కి పోయి మీ పనులు మీరు చేస్కోని బతుకుపోండ"ని ఓ ఉచిత సలహా పారేశాడు పుల్లారెడ్డి.

పుల్లారెడ్డిచ్చిన సలహాకి రెచ్చిపోయిన పుల్లమ్మ ఆగ్రహంతో "ఏంది రొడ్డీ! చేపిచ్చిదంత చేపిచ్చి ఇప్పుడేమెరగని ఎల్లిపాయమాదిరి మాట్లాడ్తావే. ఎవరికోసం మావాళ్ళిదంత చేసినారు నీకోసం కాదా?" సుటిగ ప్రశ్నించింది.

"అవును పుల్లమ్మ ఇదంతా నాకోసమే చేసినారు. కాదన్లేదు నేను. కాని ఇంత జరుగుతుందని నాకేం తెల్సు" చిన్నగా జారుకోబోయాడు పుల్లారెడ్డి

"అవున్లే రొడ్డీ! నీకేం తెలియదు.. మావాళ్ళకంత తెల్లే చేసినారు. అయినా మిమ్మల్ని అని ఏం ప్రయోజనం మా పీనుగులపై పేలాలేస్కోని బతకాలనే మీ బుద్ధుల్ని మా జనం తెల్సుకోనంతకాలం మా బతుకలింతే. మీ బతుకులంతే. మా బతుకుల్ని నాశనం చేసిన మీరేం బాగువడ్తరు సర్వనాశనమైపోతార"ని మెటికలు విరిచి శాపనార్థాలు పెట్టి నిరాశతో వెనుదిరిగొచ్చింది పుల్లమ్మ.


రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్

'భారత్ వంద కోట్లు ఖర్చు పెట్టి సాధించింది ఒలింపిక్స్‌లో ఒక్క రజిత పతకం" అని అధికారులు అంటున్నారు. అంటే ఖర్చు బారెడు ఫలితం బెత్తెడు అన్న చందాన ఉంది భారత్ పరిస్థితి. ఏథెన్స్‌లో 16 రోజుల పాటు అలరించిన ఒలింపిక్ పోటీల్లో మేజర్ రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ సాధించిన రజితమే భారత్‌కు లభించిన ఏకైక పతకం అని చెప్పడానికే సిగ్గేస్తుంది. 102 కోట్ల జనాభా కలిగిన భారత్‌లో ఒలింపిక్స్ పతకాలు సాధించే సత్తా కలిగిన క్రీడాకారులే లేరా? లేక వారి సామర్థ్యాన్ని వినియోగించుకునే సత్తా మన ప్రభుత్వం వద్ద లేదా?

హసన్ షరీఫ్

గుత్తాధిపతులను దూరం చేస్తేనే క్రీడలకు మనుగడ

దేశంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు కొదవలేదు. అయితే వారిని ప్రోత్సహించి అభివృద్ధి పర్చడానికి చేయాల్సిన కృషిలోనే లోపం ఉంది. క్రీడా సంఘాలను కూడా రాజకీయ నాయకుల రూపంలో చీడ పురుగులు నాశనం చేస్తున్నాయి. ఒక్కో క్రీడా సంఘాన్ని ఒక్కో రాజకీయ నాయకుడు పంచుకొని సొంత ఆస్తిగా అనుభవిస్తున్నారు. వారి నేతృత్వంలో ఉన్న క్రీడల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టడానికి బదులు ప్రభుత్వం నుండి వస్తున్న గ్రాంట్లను ఎలా స్వాహా చేయాలనే దానిపైనే నాయకులు లెక్కలేసుకుంటున్నారు. భారత అథ్లెటిక్ సమాఖ్య అధ్యక్షుడిగా సురేష్ కల్మాడీ 15 ఏళ్లుగా కొనసాగుతున్నాడు. అతని హయాంలో భారత్ ఒక్క ఒలింపిక్ పతకం కూడా సాధించలేకపోయింది. అయినా అతను రోజురోజుకూ తన పదవిలో బలపడుతున్నాడే కానీ అతన్ని తొలగించడంపై ప్రభుత్వం ఎటువంటి దృష్టి పెట్టడం లేదు. ప్రభుత్వం నుండి గ్రాంట్లు భారీ ఎత్తున అందుతున్నప్పటికీ అథ్లెట్లకు శిక్షణ ఇచ్చేందుకు చేస్తున్న ఖర్చు అత్యల్పం. భారత ఆర్చరీ సమాఖ్యకు పార్లమెంటు సభ్యుడు వికె మల్హోత్రా 32 ఏళ్లుగా నేతృత్వం వహిస్తున్నాడు. సిడ్నీ, ఏథెన్స్ ఒలింపిక్స్‌లకు భారత్ క్వాలిఫై అవ్వడమే అతని ఆధ్వర్యంలో సమాఖ్య సాధించిన ఘనత. ఆర్చరీకి ప్రభుత్వ గ్రాంట్‌ను ప్రతి సంవత్సరం పెంచడంలో కనబరుస్తున్న శ్రద్ధ వాటిని క్రీడాభివృద్ధికి ఖర్చు చేయడంలో లేదు. సంవత్సరానికి ఏడు విదేశీ పర్యటనలు జరుపుతూ జల్సాలకు మాత్రం కొదువలేదు. 11 సంవత్సరాలుగా భారత హాకీ సమాఖ్యను తన చెప్పుచేతల్లో ఉంచుకున్న కెపిఎస్ గిల్ తన హయాంలో ఒక్క ఒలింపిక్ పతకాన్ని కూడా అందించలేకపోయాడు. ఎనిమిది ఒలింపిక్ స్వర్ణాలు సాధించిన జాతీయ క్రీడ హాకీకి పూర్వ వైభవాన్ని తీసుకురావాలంటే హాకీ అభివృద్ధికి కృషి చేసే వ్యక్తి చేతికి సమాఖ్య పగ్గాలు రావాలి. జట్టు ఎంపికను ఏక సభ్య సెలెక్షన్ కమిటీ చేయడం హాకీపై గిల్ గుత్తాధిపత్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. మాజీ పార్లమెంటు సభ్యుడు కెపి సింగ్ డియో భారత రోయింగ్ సమాఖ్య అధినేతగా గత 20 ఏళ్లుగా కొనసాగుతున్నాడు. రాజకీయ నిరుద్యోగాన్ని అతడు ఈ విధంగా భర్తీ చేస్తున్నాడు. సిడ్నీ, ఏథెన్స్ ఒలింపిక్స్‌లలో భారత్ చివరి స్థానంలో నిలిచేట్లు చేయడంలో ఇతడి 'విశేష కృషి' దాగి ఉంది. 2001-2003 వరకు 88 లక్షల రూపాయల గ్రాంటు పొందిన సింగ్ క్రీడాకారుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఖర్చు చేసింది ఏమీ లేదని పై ఫలితాలు చూస్తే తెలుస్తుంది. టేబుల్ టెన్నిస్‌ను మాజీ ఎంపి అజయ్ చౌతాలా 20 ఏళ్లుగా ఏలుతున్నాడు. 1979లో ప్రపంచంలో 16 స్థానాల్లోపు నిలిచిన భారత టిటి జట్టు ఇటీవల 34వ స్థానానికి దిగజారడంలో చౌతాలా 'అవిరళ కృషి' దాగి ఉంది. సింగిల్స్‌లో ఒక్క ఆటగాడు మాత్రమే 200లోపు ర్యాంకులో ఉన్నాడు. ఈ విభాగంలో ఒలింపిక్ పతకం ఊహించడం కూడా అత్యాశే. అయినా చౌతాలా స్థానానికి ఢోకా లేదు. ఫుట్‌బాల్‌పై పిఆర్ దాస్ మున్షీ 15 ఏళ్లుగా గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాడు. ప్రపంచంలో 143వ ర్యాంకులో ఉన్న భారత ఫుట్‌బాల్ జట్టు ఒలింపిక్స్‌లో పతకం తెస్తుందంటే ఎవరూ నమ్మడానికి కూడా సిద్ధంగా లేరు. షూటింగ్‌కు 16 ఏళ్లుగా కార్యదర్శిగా ఉన్న దిగ్విజయ్ సింగ్ గత నాలుగేళ్లుగా నేతృత్వం వహిస్తున్నాడు. సిడ్నీలో ఫైనల్ వరకూ వెళ్లిన అంజలీ నాలుగేళ్ల తర్వాత జరిగిన ఏథెన్స్ ఒలింపిక్స్‌లో తొలిరౌండ్‌లోనే నిష్క్రమించడంలో షూటింగ్ అభివృద్ధికి దిగ్విజయ్ కృషి 'అభినందించదగిన విషయం'. అయితే రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ రజిత పతకం సాధించి దేశ గౌరవాన్ని ఇనుమడింపజేయడంతో దిగ్విజయ్ సింగ్ స్థానం బలపడినట్లే!

వంద కోట్లు ఎవరికి ఖర్చు చేసినట్లు?

ప్రభుత్వం వంద కోట్లు ఖర్చు చేసి ఎవరికి ఇచ్చినట్లు? అన్ని క్రీడల్లోనూ మౌలిక సదుపాయాలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే చందాన ఉన్నాయి. క్రీడాభివృద్ధి విషయంలో చైనాను చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. చైనా పరిమితమైన వనరులతో కొన్ని క్రీడాంశాలను ఎంచుకొని అందులో దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళ్తుంది. మనం కూడా ఆ వంద కోట్లను పరిమితమైన కొన్ని క్రీడాంశాలకు ఖర్చు చేసి స్వల్పకాల, దీర్ఘకాల లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. అవసరమైన రీతిలో ఖర్చు చేసి ఒక్క క్రీడాంశంలో సంతృప్తికర ఫలితం వచ్చిన తర్వాత మరో క్రీడాంశంపై దృష్టి కేంద్రీకరించాలి. అప్పుడే పతకాలు సాధ్యమవుతాయి. చైనా తొలుత జిమ్నాస్టిక్స్, టేబుల్ టెన్నిస్, షూటింగ్, డైవింగ్‌పై దృష్టి కేంద్రీకరించింది. ఆ అంశాల్లో దాదాపు క్లీన్‌స్వీప్ దిశగా దూసుకెళ్లిన తర్వాత ఇప్పుడు వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్‌పై దృష్టి కేంద్రీకరిస్తోంది. 2012 ఒలింపిక్స్‌లో పతకం సాధించగలిగే క్రీడాకారులను ఎంపిక చేసి ఇప్పటినుండే ప్రత్యేక శిక్షణ ఇస్తోందంటే చైనా దీర్ఘకాలిక వ్యూహాన్ని అర్థం చేసుకోవచ్చు. భారత్‌లోలాగా చైనాలో స్వాహా చేసే క్రీడాధికారులు కనబడరు. అందుకే మనం వంద కోట్ల రూపాయలు ఖర్చుచేసి ఒక్క స్వర్ణం కూడా సాధించలేకపోయాం. ఆ వంద కోట్లలో చైనా కనీసం 20 స్వర్ణాలు సాధించగలిగే అథ్లెట్లను తయారు చేయగలదు. మనకు, చైనాకు మధ్య గల తేడా అదేమరి! ◆

"సంతాన కామేష్టి వ్రతం!"

రుక్మిణి



నర్సిమ్మ రావిచెట్టు దగ్గరకు వచ్చీరాగానే భోరుమన్నాడు. వస్తున్న ఏడ్పుని తీర్లుగ చేసి చూపిచ్చిండు. ఆటెంక కండ్లు తుడ్చుకుని చప్ట మీద కూలబడ్డడు. ఎక్కిల్లు మాత్రం అస్సలు ఆపటం లేదు. జక్కులోడు వాడ్ని వివరాలడిగిండు. యాద్గిరి బీడీ పీకులు పీకుతూ ఇనుకుంట కూలబడిండు!

"అరె... ఏమైందిర? ఎవులన్న తిట్టింద్రా... సంగతేందిర... కొట్టినార్రా.. బాంచెత్.. వాండ్లని నంగతేందిరా?" జక్కులోడు దమాయించిండు.

వాడు "చెప్పుకుంటపోతే గది చాంతాడంతుంది. కర్మరా కర్మ" – లపలప చేత్తో తల బాదుకున్నాడు. జక్కులోడు ఆపు చేసిండు. "అరె... తలకాయ పాడైపోద్ది గాదుర. జర నమ్మలంగ నీ బాదచెప్పు.. అరె.. ఏందిరా గిది... ఏడుపు?" అని కాస్తంత దయిర్నం చెప్పినంక వాడు కుదురుపడ్డడు.

"ఒరే జక్కులా... నాకు పెండ్లయి తొమ్మిదేండ్లయింది గద... గపుడు అయిదు యాటల్ని గోసి మీకందరికి బిర్యాని వండిచ్చి పెట్టినగాదుర... నీకు కావాల్నింటే సీక్రెటుగా బీరు బాటిలు కూడా కొని పోయిస్తిని.. నువు తాగితివి!"

"సంగతి చెప్పరాదురబే!" జక్కులోడు భీతీశునిలా అరిచిండు. వాడికి పెయ్యంత మంటగుండె! నర్సిమ్మ సదురుకున్నడు. "గదేరా... నా పెండ్లమేమో నా మేన సమ్మందమయి పాయె! పెండ్లయినప్పట్నుంచి దానికి పిల్లలు పుట్టకపోయేతలికి, అటు మా మావ లం....కొడుకు...అత్త ఒకటే లొల్లాయె! మా అయ్యదీ గిదే రూటు! పొద్దుగుంకి సీకటి పడడంతోటే నా పెండ్లం కూడ సిర్రుబుర్రులాయె! ఎకసెక్కెం మాటలు..ఛ...నా కాడికి నేను నా మిడుకులు మిడుకుతనే వుంటిని! గిందుల నా తప్పేందిర...నువ్వే చెప్పు! చెప్పరా!"

జక్కులోడికి మండిపోయింది – "సంగతి చెప్పుర" అని గద్దించిండు.

"ఆహఁ.. ముందుగాల గాడెవడో సన్యాసోడు భూతాల వయిద్యం చేసి, మంత్రాలు చేసి, విబూతులు పెడితే ఖచ్చితంగ పిల్లలు పుడతారని నమ్మబలికె! వాడ్ని ఇంట్లోబెట్టి.. పూజలు–చక్రాలు.. ముగ్గులు... నిమ్మకాయలు.. నల్లకోల్లు ఇల్లు ఇల్లంత గుల్లయిపాయె! కొసాకరికి వాడు పాలల్ల మత్తుమందు కలిపి దాంతోని తాగిచ్చి, మాయజేసి దాన్ని...దాని బంగారాన్ని తీసుకొని వుడాయించాల్నని చూస్తే పట్టు కుంటిమి. గదో పెద్ద గందరగోళమయిపాయె! పరువు పూరాగా పాయె!" (వాడు రెండు వెక్కిళ్ళు వెక్కాడు) జక్కులోడు మటమటలాడి పండ్లు పటపట కొరికిండు!

"ఇంగ గటుతర్వాత అమ్మపాలెంల గాడెవడో 'పిల్లగాండ్ల పసరు' పోస్తడని, గుంపులు..గుంపులు జనాలు పోతంటే గాడికి పది వారాల 'పసరు' తాగిత్తిని–నాతోని కూడ 'పసరు' తాగిచ్చిరి...యాఖ్..ధీంత్తెరి! గా దెబ్బకు నా ఒళ్ళంత నీరసం కమ్మి ఈ ఆర్నెల్లు లేవకుంట మంచానికి అతుక్కుపోతిని..గిన్ని చేసినా వీండ్లు గా పిల్లలగోల వదల్రాయిరి..సర్సరె..తిట్టకు..మరి గక్కడెవరో మానుకోటలో డాక్టరమ్మ వైద్యం...ఇంజీషన్లిస్తే పోరగాండ్లు గ్యారంటీ అంటే ఆడికి పోతిమి..వామ్మో..."

నర్సిమ్మ అదురుకుని గుండె పట్టుకుని కాసేపు తలబాదుకున్నడు. "ఎన్ని పైసలు...నా 'సారం' అంతా పిండిరి! ఎకరం పొలం రెండెకరాల చెలక చెక్క అమ్మితిని–గా సంబరం ఒక్క ఏడు అయినంక ఇంగ ఇవన్ని కాదనుకుని తీర్థయాతర్లకి లేవదీసిరి–వామ్మో...పదివేలు రెడ్డిదొరతాన అప్పుచేసి అటు సంపూర్ణ ఉత్తరం...పూరా దక్షిణం తీర్థయాత్రలు చేస్తిమి – గోదారి పుస్కరాలకుబోతినీ...గోదాట్లో పుణుక్కున మున్కలేస్తిని ...గివన్నిచోట్లా పదిసార్లు బలిమిన నా గుండు గొరిగిరి–వస్తిమి!"

ఈ సోదంత భరించడానికి జక్కులోడు తయారుగ లేడాయె! వాడు ఇంగ లాభం లేదనుకుని వాడి తలకాయను వాడే లపలప చరుచుకుని నర్సిమ్మకు కూడా సైగజేసిండు – వాడు ముందు బిత్తరపోయి, అటెంక అర్థమైపోయి, ఇంగ తప్పదనుకుని వాడుకూడా లప్పలప్ప బాదుకుండు.

"సరెరా..నీకు బోరు కొడతందేమోగాని నాకు సావుమరణంగుంది– మొన్న సంవత్సరం నుండి ఎవడో గుడిపూజారి తగులుకుని పొద్దున్నే..చిమ్మచీకట్లె సన్నీళ్ళ స్తానం.. రోజుకు వందసార్లు గుడిప్రెదక్షనాలు ... ఒంటి పూట సప్పిడికూడు. రాత్రిపూట సాపమీద చద్దరు లేకుంటా పండుకుని వెయ్యిసార్లు 'రామనామజపం' చెయ్యమనె! దీనొక్కదానికే అయితే పీడా పాయిరి! అది నాక్కూడా అంటించె! ఇటు తిండిలేక... గిరగిర తిరగలేక... సప్పిడికూడు... సాపనిద్ర! 'రామజపం' వామ్మో... మరింగనేను బతకలేన్ర... ఏ బాయిల్నయిన దునుకుత..." తర్వాత జక్కులోడు వాదనకు తగులుకుండు.

"అరె గవన్నీ చేసినోడివి... పోయ్ను అయిదారేండ్ల నుండి గీ అవస్తలన్ని పడుతున్నవుగద... మరి గివన్ని నీకిప్పటికె అలవాటయి పోయుండాలె... అలవాటు కూసువిద్య – కొత్తోడికైతే కుతుక మీదికొస్తది – నీకు గివి కొట్టిన పిండేనాయె! నీకేం భయంరా...నీకేమైంది – కొత్తగా నిన్నుగాని గిపుడు సూత్రంబెట్టి తలకాయ కిందబెట్టి చేతులమీదగాని నడ్వమన్నడా–గట్లయితే పిల్లలు పుడతరనిగాని చెప్పినాడ్ర..." యాద్గిరి బీడి దమ్ములాగి అవతలకు విసిరిపారేసి కడుపార నవ్వుతూ అడిగిండు.

"అదికాదే...రాత్రి నాకు కవలపిల్లలు పుట్టింద్రు... ఇద్దరూ మగపోరగాండ్లే!" జక్కులోడు 'చబ్బాస్" అని వాడ్ని ఒకటి చరిచిండు. "దావతీయర" అని కూడా వుషారు చేసిండు.

"అది కాదుర...గీ విషయం తెలవంగనే ముందు మన గుడిపూజారి భారీ కట్నం ఇవ్వమని తగులుకుండు... గా పారిపోయిన దొంగభూతాల వయిద్యుడు రెండువేలు పంపమని మతలబు చేసిండు...మానుకోట డాక్టరమ్మ పదివేలు ఫీజు పంపమని కాంపౌండరుతోని కబురు పంపింది. అరె వీళ్ళందరి విభూతులు...తాయెత్తులు... భజనలతోని నాకు కవల పోరగాండ్లు పుట్టింద్రామరి... మొగుడ్ని.. మొగోడ్ని.. నేను ఎదవనీ,,, చేతకాని వాడ్నా... జర చెప్పు యాద్గిరన్నా?"

యాద్గిరి మరో బీడి వెలిగించిండు.. "ఒరె నర్సిమ్మా... గిదంతా మూర్ఖం... నీ సంగతిగట్ల వదిలిపెట్టు! మన గవర్మెంటు రైతు జనాలు వానల్లేక అల్లల్లాడి పోతంద్రని కృత్రిమవానలు... మేఘమథనం అని 12 వందల కోట్లు ఖర్చు పెట్టి, ఫారిన్ విమానాలు కిరాయికి తెచ్చి పథకం మొదలుపెట్టిరి – గదే టయింల రుతు పవనాలు లేటుగ మొదలయినై – గిటు బంగాళఖాతంల అల్పపీడనం అంచెలంచలుగ కమ్ముకొచ్చె – పెళపెళమని వానలు కురవబట్టె! మన సైంటిస్టులు నోరెళ్ళబెట్టిరి – ఏందిది? గీవానలేంది...వరదలేంది – గివి మన 'మథనం' దెబ్బకు వచ్చినవేనా అని లాబరేటరీల్ల పరీక్షలాయె – మరో కొంటెవాడు గీడ మనం 'మథనం' చేస్తే గటు ఒరిస్సా, మహారాష్ట్ర, బీహారుల్లో భారీ వానలు కుర్సి ఊర్లకు ఊర్లు ఆగమైపోతున్నయని హాస్యమాడె! ఏందిర...ఏ ఫలితం వెనక ఏ ప్రయత్నం వుందో ఎవడికి మాత్రం వెంటనే తెలిసిచస్తదిగనక..."

నర్సిమ్మ కండ్లు మిటకరిస్తూ యాద్గిరి వంక మెచ్చుకోలుగా చూస్తండు! ✤



జీవితంలో ప్రతి మనిషికి ఏదో అలవాట్లు తప్పనిసరిగా ఉంటాయి. ఇందులో కొన్ని మంచి అలవాట్లు మరికొన్ని చెడ్డ అలవాట్లు కూడా ఉండవచ్చు. అలవాట్లు మంచివయితే, తమకే కాకుండా సర్వమానవ కళ్యాణానికి, సమాజ శ్రేయస్సుకు కూడా అవి ఉపయుక్తంగా ఉంటాయి. అలా కాకుండా అవి దురలవాట్లు అయితే తమకే కాకుండా సమాజానికి కూడా అవి నష్టాన్ని కలిగించేవిగా ఉంటాయి. అదేవిధంగా ఈ అలవాట్లు అనేవి వంశపారంపర్యంగాను, కుటుంబ పరంగాను కొన్ని సంక్రమిస్తే, మరికొన్ని స్నేహితుల ద్వారా, పరిసరాల ద్వారా సంక్రమిస్తుంటాయి. ఏది ఏమైనా దురలవాట్లు అనేవి వినాశనానికి కారణభూతమవుతాయి. కనుక వాటికి దూరంగా ఉండడం మంచిది.

గుట్కాలు - నోటి క్యాన్సరు



డా॥ కె.ఎల్.వి.ప్రసాద్

అయితే నవనాగరిక ప్రపంచంలో కొన్ని అలవాట్లు అవి చెడ్డవయినప్పటికీ, సమాజంలో ఎంతో ఫ్యాషన్‌గా చెలామణి అవుతుంటాయి. వీటికి అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతుంటారు. ప్రధానంగా యువకులు, కార్మికులు ఇలాంటి అలవాట్లకు బానిసలవుతున్నారు. ఈ విధంగా అనేక వర్గాలను బానిసలుగా చేసుకొని, ఆ తర్వాత చేదు అనుభవాలకు గురి చేస్తున్న అలవాట్లలో 'గుట్కా తినడం' ఒకటి.

ఒకప్పుడు పాన్‌లు, పాన్ మసాలాలు, జర్దాపాన్‌లు విశేషంగా ప్రాచుర్యంలో ఉండేవి. వీటికి తోడు సిగరెట్లు, బీడీలు, చుట్టలు ప్రజలను వ్యాధిగ్రస్తులను చేస్తుండేవి. ఈనాడు అధిక ప్రాచుర్యం పొంది, అనేక మందిని వ్యాధిగ్రస్తులను చేసి ఆనక నరక కూపంలోకి తోస్తున్న దురలవాటు ఈ 'గుట్కా తినడం'.

ప్రసార మాధ్యమాల ద్వారా, పత్రికల ద్వారా గుట్కాలకు సంబంధించిన ఆకర్షణీయమైన ప్రకటనలు కోట్ల రూపాయలలో ఉంటున్నాయంటే, గుట్కాల అమ్మకాలు ఏ విధంగా ఉంటున్నాయన్నది ఆలోచించవలసిన విషయం. ఈ గుట్కాల వాడకం నిషేధించబడినప్పటికీ, అమ్మకాలలోను, వాడే వారిలోను ఎలాంటి మార్పు వస్తున్న లక్షణాలు కన్పించడం లేదు. నల్లబజారుల్లో ఇవి అతి సులభంగా అందుబాటులోకి వస్తున్నాయి.

గుట్కాల తయారీలో ప్రత్యేకత ఏమిటంటే, ఇది అన్ని వర్గాల ప్రజలకు ఆయా రేట్లలో లభ్యం కావడం. అందుచేత ఈ గుట్కాలు అందరికీ అందుబాటులోకి వస్తున్నాయి.

గుట్కాలు పొగాకు ఉత్పత్తులే! అన్న విషయం చాలా మందికి తెలీదు. అయితే ఇతర ఉత్పత్తులకు, గుట్కాలకు మధ్య గల వ్యత్యాసం ఏమిటంటే, వీటిల్లో ఉండే క్యాన్సరును కలిగించే రసాయన పదార్థాలు, నోటి లోపలి సున్నితమైన చర్మం ద్వారా అతి సులభంగా శరీరంలోనికి చేరిపోతుంది. అందుచేత చుట్టలు-సిగరెట్ల కంటే



క్రింది పెదవికి పళ్ళకు మధ్య గుట్కా ఉంచిన విధానం

కూడా, గుట్కాలు అతి ప్రమాదమైనవని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. అలా అని గుట్కాలకు ప్రత్యామ్నాయంగా చుట్టలు, సిగరెట్లు, బీడీలు వాడమని చెప్పడం ఈ వ్యాసం ఉద్దేశం కాదు. వ్యాధి సోకే తీవ్రతను గురించి చెప్పడమే దీని ఉద్దేశం.

గుట్కాలు ప్రమాదమా ?

గుట్కాలు తినడం వల్ల వాటిల్లో ఉండే ప్రేరక పదార్థాల వల్ల తాత్కాలికంగా మనిషికి ఉత్సాహం, హుషారు ఉండవచ్చునేమో గాని, వీటి వాడకం వల్ల ప్రాణహాని కలుగుతుందన్న విషయం గుట్కాలు వాడేవాళ్ళు తెలుసుకోవాలి. గుట్కాల వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు సామాన్య ప్రజానీకం పరిష్కరించుకోలేని స్థాయిలో ఉంటారు. అంటే వ్యయప్రయాసలతో కూడుకున్న విషయం అన్నమాట! అది కూడా ప్రాథమిక దశల్లో గుర్తించినప్పుడు మాత్రమే చికిత్స చేయించుకునే అవకాశం ఉంటుంది.

వ్యాధి ముదిరితే ప్రాణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

గుట్కాలు - సమస్యలు :

గుట్కాలను నమలడం ద్వారా, బుగ్గన, పెదవుల దగ్గర ఉంచుకొని దాని రసం చప్పరించడం ద్వారా ఎనలేని అనుభూతికి లోనవుతుంటారు. గుట్కావాడకం దారులు వీటి వాడకం వల్ల సమస్యలు వస్తాయని తెలిసి కూడా కొందరు తర్వాత ఎదురయ్యే పరిణామాలు తెలియక మరికొందరు ఈ గుట్కాలకు బానిసలవుతున్నారు. ఈ గుట్కాలు వాడడానికి, వాటి ద్వారా సమస్యలు రావడానికి వయస్సుతో అసలు పని లేదు. దీనికి లింగభేదం కూడా లేదు. అంతస్తులతో అసలు పని లేదు.

అతిగా గుట్కాలు సేవించే వారిలో ప్రథమంగా కొన్ని అనారోగ్య లక్షణాలు బయటపడుతుంటాయి. కనీసం ఈ లక్షణాలు బయటపడుతున్నప్పుడు గుట్కా తినడం ఆపి, తగిన చికిత్స చేయించుకోగలిగితే బ్రతికి బయటపడ్డట్టే. కాని చాలా మంది ప్రాథమిక స్థాయిల్లో నిర్లక్ష్య వైఖరి అవలంబించడం మూలాన ప్రమాద పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

గుట్కాలు తినడం మొదలు పెట్టిన తరువాత కొంత కాలానికి నోరు మంట పుడ్తుంటుంది. అంటే కొంచెం కూడా కారం తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీనిని వ్యాధికి సిగ్నల్‌గా భావించాలి. తరువాత నోటి లోపలి సున్నితమైన బుగ్గ చర్మము (బక్కల్ మ్యూకోజ) నాలుక దళసరిగా ఏర్పడడం జరుగుతుంది. ఇది క్రమంగా అంగుటికి, పెదవులకు పాకుతుంది. సున్నితంగా ఉండేబుగ్గ చర్మం, పెదవుల చర్మం, అంగుటి చర్మం దళసరిగా తోలు మాదిరిగా తయారవుతుంది. ఈ లక్షణాలు వ్యాధి ముదురుతున్న చరిత్రను అందిస్తాయి. నోటిలో మంట పెరగడం, ఆహారం తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది.

ఆ తర్వాత వ్యాధి బుగ్గ కండరాల లోనికి వ్యాపించి నోరు తెరుచుకోవడానికి, మూసుకోవడానికి ఉపయోగపడే ముఖ్య కండరాలు చారలు మాదిరిగా ఏర్పడి బిగుసుకుపోతాయి. తద్వారా దవడల కదలిక తగ్గుముఖం పట్టి, ఆ తర్వాత క్రమంగా నోరు మూసుకుపోతుంది. ఆహారం నమల లేని పరిస్థితి ఏర్పడుతుంది. కింది దవడ (మాండిబుల్) అడుగు భాగాన ఉండే 'లింపు గ్రంథులు' వాచి నొప్పిని కలిగిస్తాయి. ఈ విధమైన ప్రధాన లక్షణాలతో వ్యాధి ప్రారంభమవుతుంది. దీనిని "ఓరల్ సబ్-మ్యూకస్ ఫయిబ్రోసిస్" అంటారు. దీనిని 'క్యాన్సర్'గా మారదగ్గ నోటి వ్యాధిగా గుర్తించారు.

ఈ పరిస్థితులలో వ్యాధి ముదిరినప్పటికీ దానికి చికిత్స చేయించుకునే విషయంలో నిర్లక్ష్యం వహించడం, గుట్కా తినడం కొనసాగిస్తే ఈ వ్యాధి క్రమంగా నోటి క్యాన్సరుగా మారే అవకాశాలు మెండుగా ఉంటాయి.

ఆహారం తీసుకో లేని పరిస్థితి ఏర్పడడం వల్ల క్రమంగా నీరసం ఆవరించడం, మనిషిలో ఒక రకమైన నిరుత్సాహం, భయం ఏర్పడడం జరుగుతుంది. నమన్య ఈ స్థాయికి చేరుకున్నప్పుడు, నరకం కోసం వేరే చోటికి పోనవసరం లేదు. భరించలేని నొప్పి మనిషిని నిర్వీర్యం చేస్తుంది. గుట్కా అతిగా వాడడం వల్ల నోటి క్యాన్సరు బుగ్గలకు గాని, అంగుటికి గాని, పెదవులకు గాని, నాలుకకు గాని, వాటన్నింటికి గాని లేదా బుగ్గను చీల్చుకొని బయటకు పెద్ద క్యాన్సరు పుండు ఏర్పడడం గాని జరుగుతుంది.

ఈ స్థితిలో వైద్యం చాలా ఖరీదైనదిగా మారుతుంది. సామాన్యుడికి అందుబాటులో ఉండదు. అయినా వ్యాధిగ్రస్తుడు బ్రతికి బట్టకట్టే అవకాశాలు అతి తక్కువ.

చాలామందికి ఈ విషయంలో కొద్దోగొప్పో తెలిసినప్పటికి గుట్కాలు మానలేకపోవడం విచారకరం. తెలిసి ఇబ్బందులు కొనితెచ్చుకోవడం మూర్ఖత్వం కాక మరేమిటి? కష్టాలను కొని తెచ్చుకోవడం కాదా! ఎంతో మంచి భవిష్యత్తు ముందున్న నేటి యువత ఇలాంటి దురలవాట్లకు బానిసలు కావడం దురదృష్టకరం.



నోటి లోపల బుగ్గకు క్యాన్సరు

ఈ విషయాలన్నింటిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గుట్కాల అమ్మకాలను నిషేధించింది. ప్రజలు ఈ నిషేధాన్ని గౌరవించాలి. ఇది ఎవరికోసం ఎందుకు చేశారన్నది ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. దొంగచాటుగా కొనుక్కొని వీటిని తినడం వల్ల నష్టపోతున్నది ఎవరన్న విషయం తెలుసుకోవాలి.

గుట్కాను సేవించడం ద్వారా ఎదురయ్యే విపత్కర పరిణామాల గురించి అధిక ప్రచారం చేయడం కోసం, ప్రజలలో అవగాహన తీసుకురావడం కోసం, ప్రభుత్వ సంస్థలతో పాటు, ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వస్తున్నాయి. ఇది అందరు ఆహ్వానించదగ్గ విషయం. వీటికి తోడు మరింత ప్రచారం జరగవలసిన అవసరం ఉంది. పాఠశాలల్లో, కళాశాలల్లో, ప్రజానమావేశాల్లో, గుట్కాలను గురించిన ప్రమాదకర విషయాల గురించి అధిక ప్రచారం చేయాలి.

పంచాయతీ ఆఫీసుల వద్ద, కలక్టరేట్, జిల్లా పరిషత్ వంటి కార్యాలయాల వద్ద, వాటి గురించిన అవగాహన ప్రకటనలు ఆకర్షణీయంగా తయారు చేయించి ప్రదర్శించాలి. సమాజంలో ప్రతి ఒక్కరు దానికి సహకరించాలి.

"గుట్కాలు మానండి! క్యాన్సరుకు దూరం కండి!!" ❖

నోటిలో నాలుకకు క్యాన్సరు

నవీన్ కథలు

నవీన్ ప్రఖ్యాత నవలాకారుడే కాదు మంచి కథా రచయిత కూడా. మామూలు అంశాలను- ధోరణులను కూడా ఒక కొత్తకోణంలో విశ్లేషిస్తాయి వారి కథలు. ఫెమినిజమైనా, విప్లవపెడధోరణులైనా, కుటుంబ సంబంధాలైనా, దోపిడి విధానమైనా ఇంతవరకు ఎవరూ స్పృశించని విధంగా తన కథలను తీర్చి దిద్దడంలో నవీన్‌గారి ప్రత్యేకత వేరు.

ఫెమినిజానికి సంబంధించి కుటుంబంహింస-లైంగికహింస స్త్రీలను ఎలా అణచివేస్తుందో స్త్రీవాదులకంటే భిన్నంగా, కొత్తగా నవీన్ కథలు వివరిస్తాయి. నవీన్ స్త్రీవాద కథల్లో కనిపించే మగాళ్ళు విద్యాధికులు, ఉన్నత కుటుంబాలకు చెందినవారు. సమాజంలో ఉన్నతస్థాయిలో మరికొందరు విదేశాలలో ఉంటారు. అయినా, వారిలో కనీస సంస్కారం కూడా ఉండదు. స్త్రీని గౌరవించడం, ఆమెను సమానస్థాయిలో చూడడం అంటే భరించలేని సాంప్రదాయ దృష్టి వారిది. స్వయం నిర్ణయాధికారం లేకుండా ఇంటి చాకిరి పేరుతో స్త్రీలు కుటుంబంలో ఎంతగా అణచివేతకు గురవుతారో "అనంతం" కథ వివరిస్తుంది. అమెరికా సంబంధమని మురిసిపోయి పెండ్లి చేస్తే భార్యంటే వాడి దృష్టిలో ఒక పని మనిషి మాత్రమే. వాడి శాడిస్టు చేష్టలను భరించలేక, ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడం కోసం వాడ్ని వదిలేసి వచ్చిన సారిక కథ ' 'కార్యేషుదాసి'. విద్యాధికుడైనా, సంస్కారహీనుడైన భర్త పెట్టే అగచాట్లను భరించలేక అతడ్ని విడిచి వెళ్ళిపోయిన స్త్రీ కథ " ఓ హక్కు కోసం". శాడిస్టు, సెక్సువల్ పర్వర్షన్స్‌లో హింసించే భర్తతో బాధలు పడేకన్నా ఆత్మహత్యే శరణ్యమని భావించిన సృజనను ఒక కొత్తదారి వైపు మళ్ళించడమే 'ఎనిమిదో అడుగు". కుటుంబ హింస నుండి బయటపడిన స్త్రీలను తమ స్వీయ వ్యక్తిత్వంతో కొత్త జీవితాన్ని ప్రారంభించామనే ఒక అశావహ దృక్పథంతో నిండివుంటాయి నవీన్ కథలు.

ఊళ్ళను వదిలి నగరాలకొచ్చిన దొరలు కొత్త కొత్త విధానాలతో శ్రమదోపిడిని ఎలా కొనసాగిస్తారో. తెలియజేసే కథ "చెర". దొరలు సాగించే లైంగిక దోపిడిని చాలా చాకచక్యంగా తిప్పికొట్టడానికి ఒక కొత్త కోణంలో చిత్రీకరించిన కథ " నిప్పురవ్వలు"

సమసమాజ స్థాపన కోసం ఉద్యమించిన నక్సలిజం అరాచక శక్తుల ప్రవేశంతో తన మునుపటి ఆశయాలను విస్మరించి, దోపిడి దొంగలుగా మారి ప్రజలను పీడిస్తున్నారనే నిజాన్ని నిర్భయంగా చెప్పిన ఏకైక కథకుడు నవీన్. నిర్బంధ వసూళ్ళతో నక్సల్స్ గ్రామాలను ఎలా భయభ్రాంతం చేస్తున్నారో 'ప్రతిఘటన' కథ తెలియజేస్తుంది. ఊళ్ళల్లో అన్నల పేరిట చందాలు వసూలు చేయడం, ఇవ్వనివారిని బెదిరించడం, వారిపై కక్షగట్టి హత్య చేయడాన్ని "బలి" కథలో చూడవచ్చు. దీన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది ఎటూ బ్రతకలేని వాళ్ళు అన్నల పేరు చెప్పుకొని డబ్బులు వసూలు చేసి ధనవంతులైన వారు కూడా వున్నారని "ప్రజల డబ్బు"

అంపశయ్య నవీన్ కథలు

అంపశయ్య నవీన్ కథలు
రచన : నవీన్;
వెల : రు.90;
పేజీలు : 199;
సోల్‌డిస్ట్రిబ్యూటర్స్ : నవోదయ బుక్‌హౌస్, 3-3-865, ఆర్యసమాజ మందిరం ఎదురువీధి, కాచిగూడ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

తెలియజేస్తుంది. అమాయకుడైన వెంకటయ్య ఇంటిని అన్నలు ఎందుకు బ్లాస్ట్ చేశారో తెలియదు. నష్టపరిహారం కోసం ప్రభుత్వం చుట్టూ తిరిగి అందరికి పర్సంటేజీలు ఇవ్వగా అతనికి ఏమీ మిగలదు. కూల్చేసిన అన్నలు కూడా అందులో టెన్‌పర్సంట్ కోరడం మరింత విషాదం. సమాజం ఎంత భ్రష్టు పట్టిపోయిందో ఈ కథ చదివి తెలుసుకోవచ్చు. సమాజాన్ని మార్చాలి అన్న అభివృద్ధి దృక్పథాన్ని ఎరగా వాడుకొని అమాయక విద్యార్థులను ఉద్యమంలోకి చేర్చుకొని వాళ్ళతో విధ్వంసకర కార్యక్రమాలను చేయించడం, వాళ్ళు పోలీసులకు చిక్కి ఎన్‌కౌంటర్ కావడం "ఆర్నెల్ల దాకా రాను'' కథలో కనిపిస్తుంది. మాజీమంత్రి హయగ్రీవాచారి హత్య నేపథ్యంలో ఈ కథ రూపొందిందని ఇట్లే తెలిసిపోతుంది.

ఊళ్ళలో దొరల అధిపత్యానికి, దోపిడికి అడ్డుకట్టవేసిన అన్నలను, వారి సానుభూతిపరులను వెంటాడి చంపే విధానాన్ని "దాడి" తెలియజేస్తుంది. అమాయాకులైన వారిని ఎన్‌కౌంటర్ చేసి వాళ్ళను తీవ్రవాదులుగా ప్రకటించే పోలీసుల తీరును "ఎదురుదాడి" చిత్రీకరించింది. పాత పరిచయం వల్ల అండర్‌గ్రౌండ్‌లో పనిచేసే మిత్రుడికి లిఫ్ట్ ఇచ్చిన పాపానికి పోలీస్ ఎన్‌కౌంటర్‌లో బలయిపోయిన అమాయకుడి కథ "నా ప్రాణానికి ప్రాణం". దీనికి ధీటుగా నక్సల్స్ కాల్పులు ఉంటాయనే కథ మరొకటి. తొందరపడి ఒక అమాయకుడ్ని పోలీసు ఇన్‌ఫార్మర్‌గా భావించి విప్లవ పార్టీలవాళ్ళు హత్య చేయడాన్ని "పాతపాట" చూపిస్తుంది.

"ట్యూషన్ మేష్టారు" చెరలోంచి స్వేచ్ఛకోసం తపించి బయటపడిన కథ ఒకటికాగా, డబ్బు చుట్టు అన్ని సంబంధాలు తిరుగుతాయని మరో రెండు కథలు తెలియజేస్తాయి. ఆత్మన్యూనతా భావంతో బాధపడే గురవయ్య తన అజ్ఞానం, అమాయకత్వంతో ఒక మానసిక రోగిలా తయారై ఆత్మ'హత్య' చేసుకుంటాడు. తెలుగులో వచ్చిన గొప్ప మనోవిశ్లేష్ణాత్మక కథల్లో ఇది ఒకటి. తాగుడు వల్ల వచ్చే అనర్థాలను 'మత్తు" కథ తెలియజేయగా, వైవాహికేతర సంబంధాల వల్ల ఎయిడ్స్ వచ్చే అవకాశముందని "ఊబి" కథ తెలియజేస్తుంది.

నునిశిత పరిశీలన నరియైన అవగాహనతో కథలను తీర్చిదిద్దడం నవీన్ ప్రత్యేకత. పాత్రల చిత్రీకరణలో ఒక సైకాలజిస్టు కనబడతాడు. శిల్పం గురించి చెప్పాలంటే, కేవలం సంభాషణలతో కథను ఆసక్తికరంగా కొనసాగించడం శ్రీపాద వారి ప్రత్యేకత. ప్రతిభావంతులైన రచయితలకు మాత్రమే ఇది సాధ్యం కాబట్టి ఈ పద్ధతిలో రాసిన వాళ్ళను వేళ్ళమీద లెక్కపెట్టుకోవచ్చు. అచ్చు అదే టెక్నిక్‌తో నవీన్ రాసిన "అనంతం" శ్రీపాదవారిని మరిపింపజేస్తోంది. మొత్తానికి వస్తురీత్యా, శిల్పరీత్యా, నవీన్ కథలు వైవిధ్యభరితమై పాఠకులను అలరిస్తాయి.

- కె.పి.అశోక్‌కుమార్

స్వీకారం



జైత్రయాత్ర
నా జ్ఞాపకాలు -
నా అనుభవాలు

రచన : డా॥ ముక్కమళ్ళ వెంకటప్పారెడ్డి
వెల : రు.100/-;
ప్రతులకు : విశిష్ట ఫౌండేషన్, డోర్.నెం.13-8-147, 8వ లైన్, జి.వి.తోట, ఆర్.టి.సి.బస్టాండ్ ఎదురుగా, గుంటూరు,

సృష్టికి మూలం మట్టి



రచన : బూజ సైదులు;
వెల : రు.20/-;
ప్రతులకు : బి.సైదులు, బి.ఎస్‌సి, బి.ఇడి., (టీచర్), కురవి, వరంగల్.

హెచ్. రమేష్‌బాబు.



బౌద్ధమత ఆనవాళ్ళనిలయం సాంచి, అమరావతి

ప్రపంచ పర్యాటక పటంలో ప్రముఖ స్థానం పొందినది సాంచి. క్రీస్తు పూర్వం నాటి బౌద్ధ సంస్కృతి ఆనవాళ్లకు సాక్షిభూతంగా చెప్పుకోదగిన సందర్శన స్థలం ఇది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరానికి 45 కిలోమీటర్ల దూరంలో ఉంది సాంచి. భోపాల్ నుండి గంటన్నర ప్రయాణం.

క్రీ.పూ. మూడవ శతాబ్దంలో సాంచి బౌద్ధ స్థూపం నిర్మితమైంది. ఈ స్థూపాన్ని బౌద్ధమతాన్ని స్వీకరించి జీవికను మలుచుకున్న అశోకచక్రవర్తి నిర్మించాడు. అందుకేనేమో ధార్మిక భావనకు, చారిత్రక వైభవానికి ఈ సాంచి దర్పణం పడుతుంది. ఇక్కడి ప్రసిద్ధమైన సాంచి స్థూపాన్ని విశ్వ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించింది.

ఈ సాంచిలో మూడు గొప్ప స్థూపాలున్నాయి. వీటిలో పెద్దది మాత్రం విశాల అర్ధగోళాకారంలో 120 మీటర్ల వ్యాస విస్తీర్ణంలో ఉంది. దాని ఎత్తు 45 అడుగులు. దానికి నలువైపులా నాలుగు శిల్పతోరణాలు ఉన్నాయి. వాటి పై బుద్ధుడు సన్యాసం స్వీకరించే ముందు, తర్వాతి సంఘటనల గాథలు కూడా ఈ తోరణాలపై చెక్కారు నాటి విదిశ శిల్పులు. ఈ మూడు స్థూపాలు ఒక గుట్టపై వేరు వేరు ఎత్తులపై ఉన్నవి. రెండవ స్థూపం ఎత్తుగా, మొదటి, మూడవది కిందగా నిర్మించబడినది. సాంచి స్థూపాలున్న కొండ శిఖరంపై 7వ శతాబ్ద కాలంలో నిర్మించిన ఓ హైందవ దేవాలయం, ఒక మఠం కూడా ఉన్నవి. ప్రధాన స్థూపంపై ఒక మెరిసే ఛత్రం ఉంది. ఇందులో 80 బుద్ధుని అస్థికలు లభ్యమైనట్లు చెబుతారు.

సాంచిలోని శిల్పాల్లో కొన్ని విదేశీ పాలకుల కాలంలో నిర్లక్ష్యానికి గురై పగిలినవి. సాంచినీ సందర్శించే విదేశీయాత్రకుల్లో ఎక్కువగా చైనా, జపాన్, ఇండోనేషియా, శ్రీలంక దేశీయులే ఎక్కువ. బౌద్ధమతం వెల్లివిరిసిన సాంచీని సందర్శించడమంటే చరిత్రను వర్తమానంలో చూడటమే. అటువంటి వర్తమాన సాదృశ్యమైన బౌద్ధమత చారిత్రక కట్టడాలను కృష్ణా పుష్కరాల సందర్భంగా గుంటూరు జిల్లా అమరావతిలోనూ, కృష్ణాజిల్లా ఘంటసాలలోనూ చూడవచ్చు. విజయవాడ నుంచి గుంటూరుకి, గుంటూరు నుండి గంటన్నర ప్రయాణదూరంలో ఉన్న అమరావతికి బస్సు సౌకర్యాలున్నాయి. పర్యాటక శాఖవారి బస్సులో విజయవాడ నుండి అమరావతికి 60 రూపాయలు చార్జితో చేరుకోవచ్చు. మహాయాన బౌద్ధమత ప్రవక్త ఆచార్య నాగార్జునుడు బౌద్ధ విశ్వవిద్యాలయాన్ని స్థాపించినది ఈ కృష్ణానదీ లోయ ప్రాంతంలోనే. దాన్ని శ్రీ పర్వతంగా ఆ తరువాత నాగార్జున కొండ అని పిలుస్తున్నారు. చరిత్రలో ఒకనాడు ధాన్యకటకంగా పేరొందినదే అమరావతి. ఇక్కడి బౌద్ధమత కట్టడాలు శాతవాహనుల నిర్మాణరీతులను ప్రదర్శిస్తాయి. ఈ అమరావతిలో ఒకప్పుడు 36.5 మీటర్ల వ్యాసం గల పెద్ద బౌద్ధస్థూపం వుండేది. దాని చుట్టూ 4.2మీటర్ల దారి గల ప్రాకారం ఉండేది. దానిపై బుద్ధుని జాతక కథలు, జీవితదృశ్యాలు అద్భుతంగా చెక్కారు. ఆంగ్లేయులు కొన్నింటిని మద్రాసు మ్యూజియంకి, లండన్ మ్యూజియంకి తరలించగా కొన్ని నాశనమైపోయాయి. ప్రస్తుతం నమూనా స్థూపాన్ని నిర్మించి ప్రదర్శిస్తున్నారు. ఇక్కడి తవ్వకాల్లో బయటపడిన శిలాఫలకాలపై “నాగపు” అనే తొలి తెలుగుపదం బయటపడింది. ఒక బౌద్ధస్థూపానిలో నామాలు పెట్టి శివలింగంగా మార్చి అమరలింగేశ్వరాలయంగా మార్చారని, బౌద్ధంపై శైవుల దాడిగానూ కొందరు అంటున్నారు. కృష్ణాజిల్లా ఘంటసాలలో ఇటీవల బయల్పడిన బౌద్ధ కట్టడాలను పురావస్తు శాఖ, టూరిజం శాఖ తగురీతిలో ఏర్పాట్లు చేయాల్సేవుంది. ❖

సాంస్కృతిక సైన్యానికి డాక్టర్ రాజారావు కృషి

శైలి

దేశానికే సైన్యం అవసరం
సాంస్కృతిక సైన్యం
సామాజిక న్యాయం కోసం
పని చేస్తుంది సాంస్కృతిక సైన్యం
సామాన్యుడి సేవకు
తమని తాము అంకితం
చేసుకుంటాం ప్రజా కళలు
కళ కళ కోసం కాదు
కళ ప్రజల కోసం

ఇవన్నీ డాక్టర్ గరికపాటి రాజారావు స్వీయాభరణతో కళాకారులకు నేర్పిన పాఠాలు. అందుకే ప్రజాకళా తపస్విగా గణితికెక్కాడు. ప్రజలను తమ కళారూపాలతో చైతన్యం చేయడం ఒక వంతు. అలాగే దేశ ప్రజల అవసరాలు తీర్చడం కోసం సాంస్కృతిక సైన్యం నిర్మించడం మరోవంతు. ఈ నిర్మాణానికి కూడా ప్రజాకళాకారులే బాధ్యత వహించాలనే అంశం పై మాటల్లోనే ద్యోతకమవుతుంది. ఆంధ్రప్రజానాట్యమండలి వ్యవస్థాపక కార్యదర్శిగా పనిచేసి ఆ కృషిలో ఆయన సఫలీకృతులయ్యారు కూడా.

ఏ రంగంలోనైనా 'దర్శకులు' చాలా మంది ఉంటారు. మార్గదర్శకులు మాత్రం కొద్దిమందే వుంటారు. ఆ కొద్దిమందిలో రాజారావుకు ప్రత్యేక స్థానం వుంది. ఇలాంటి వారిని ప్రభుత్వాలు గుర్తించలేవుగాని చరిత్ర గుర్తిస్తుంది. వారి శిష్యుల్లో చరిత్ర విద్యార్థులైన వారు సమాజ వాస్తవికతని సంపూర్ణంగా అర్థం చేసుకునే వారి సృజనాత్మక పోరాట మార్గాన్నే 'గురుస్మృతిగా' స్వీకరిస్తారు. అలాంటి గురుస్మృతి గరికపాటి రాజారావు.

ప్రస్తుత రాజకీయ సామాజిక, సాంస్కృతిక రంగాలను పరిశీలించినపుడు ప్రజాకళాకారుల బాధ్యత నానాటికి పెరుగుతుందనేది సుస్పష్టం. బి.జె.పి., ఆర్.ఎస్.ఎస్. మతోన్మాదశక్తులు అప్రజాస్వామ్యంగా వ్యవహరిస్తూనే తామంత 'గొప్ప ప్రజాస్వామ్యవాదులు' మరెక్కడా లేరన్న చందంగా వ్యవహరిస్తున్నాయి. ఏ రోటి కాడ ఆ పాట పాడే వాజ్‌పేయి ఇప్పటికీ వారి నాయకుడు. దోపిడీశక్తుల మీడియా వారి పక్షానే ఉంటూ తందానా అంటున్నది.

ఎన్నికల్లో లభించిన ప్రజాతీర్పును మన్నించకుండా వ్యవహరించే ఒకరకమైన రాజకీయ

వెనిజులా! వెనిజులా!

వెనిజులా! వెనిజులా!
వర్తమాన ప్రాపంచిక శిఖల మీద వికసించిన ఎర్రమందారమా!
నిరాశామయ చరిత్ర చీకటిలో వెలిగిన ప్రభాత కిరణమా!
మొక్కవోని నీ ఆత్మ స్థయిర్యానికి వందనాలు
అలుపెరుగని నీ ప్రతిఘటనా పోరాటానికి వందనాలు
నిఖిల లోకపు పీడిత తాడిత జనావళి తరపున
విప్లవాభివందనాలు –
అసమాన పోరాట యోధుడు ఛావెజ్‌ని కన్నందుకు వందనాలు
సామ్రాజ్యవాద ఇనుపడేగను నిలువరించిన
ఛావెజ్‌ని వెన్నంటి వున్నందుకు వందనాలు –
వెనిజులా! వెనిజులా!
సామ్రాజ్యవాద రాక్షసద్విముఖాలను కూల్చిందని ఒకచోట
రసాయనిక ఆయుధాలు పేల్చిందని మరొకచోట
తన పోలీసు పెత్తనాన్ని ప్రశ్నిస్తుందని వేరొకచోట
కారణాలేం చెప్పినా
హాలీవుడ్ కథనాలేమైనా
నాగరికతల విధ్వంసమే కదా వాడు చేసింది –
చమురు బావుల మీద స్వాధికారమే కదా వాడు కోరింది
వాణిజ్య సంస్థగా, వరల్డు బ్యాంకుగా
ఆర్థిక వ్యవస్థల విచ్ఛిన్న క్రీడతో
దేశాల సార్వభౌమత్వాల్ని ప్రశ్నార్థకం చేస్తూ
యుద్ధ విషాన్ని చిమ్ముతున్న వెయ్యికాళ్ళ జెర్రికదా వాడు
దేశాల మధ్య వృథా కలహాలకు ఆజ్యం పోస్తున్న మాయల మాంత్రికుడు కదా వాడు–
వెనిజులా! వెనిజులా!
నీ బిడ్డ హ్యూగో ఛావెజ్ ఒంటరివాడు కాదు –
పీడిత ప్రజలకు ఉదయగీతిక వినిపించిన వెనిజులా!
నువ్వొంటరిదానివి కాదు –
బెర్లిన్ గోడ కూలిందని బెంగపడకు
ప్రపంచ ప్రజల మహత్తర స్వప్న సౌధం
సోవియట్ సోషలిజం ఆత్మహత్యించుకుందని
అధైర్యపడకు–
బ్రెజిల్ క్యూబా ప్రజారాజ్యాలూ
విరిగిన కలల నయావలసల అసహాయ అభాగ్యజీవులూ
అనకొండ మీద దండయాత్రకు నీతోనే –
సమస్త ప్రజల కలల సాకారమూ దీంతోనే –

– డా॥ కె.లింగారెడ్డి

దౌర్జన్యం బి.జె.పి. పక్షాలు చేస్తున్నాయి. ఉమాభారతి జాతీయ పతాకం మాటున మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు మరల పూనుకోవడం చూస్తున్నాం.

మతోన్మాద సంస్కృతికి రాజకీయ దౌర్జన్యం తోడై పడగ విప్పిన త్రాచులా బుసకొడుతూ వస్తున్న ఈ ప్రమాదకర స్థితిలో ప్రజా సాంస్కృతికవాదులు, ప్రజాకళాకారులు ఎంతో అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉంది. నిజమైన ప్రజాసంస్కృతికి-మతోన్మాద సంస్కృతికి, ప్రజానుకూల రాజకీయాలకు – అప్రజాస్వామ్య దౌర్జన్య రాజకీయాలకు గల వ్యత్యాసాన్ని ప్రజలకు విడమర్చి చెప్పాలి. ఆర్.ఎస్.ఎస్. మతోన్మాద సంస్కృతిని ద్వేషించేలా చేయాలి. పత్రికల్లో మీడియాల్లో లభించే కొద్దిపాటి వేధోపరమైన, సత్యమైన ప్రయోజనకర చర్చను సామాన్య ప్రజల హృదయాలకు తాకే విధంగా ప్రజాకళారూపాలు సృష్టించాలి. అందుకు సృజనశీలురైన కళాకారుల పరిశ్రమతో పాటు విస్తారమైన సాంస్కృతిక సైన్యం కూడా నేడు ఎంతో అవశ్యం. ఆ సైన్యం లేకుండా ఈ పేట్రేగిపోతున్న మతోన్మాద దుష్ట సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజాబాహుళ్యాన్ని కదిలించడం అసాధ్యం.

మరోపక్క నేటి ప్రపంచీకరణ దశలో టెలి-సినిమా వ్యాపార కళలే అసలైన కళలుగా పెట్టుబడి వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. స్వేచ్ఛా మార్కెట్ మాయాజాలంలో స్వచ్ఛమైన జానపద కళలను కూడా మార్కెట్ మయం చేస్తున్నది. అసలు ఆధునిక మనిషిని నడిపించేది మార్కెట్ తప్ప మరొకటి లేదంటూ మానవీయ విలువలను కాలరాస్తున్నాయి. సర్వసంపదలకు కేంద్ర నిలయమైన శ్రమజీవిని, శ్రమైక జీవన సౌందర్య విలువలను తృణీకరిస్తున్నాయి.

'కళ ప్రజలది-ప్రజలనుండి ప్రజలకు' అని లెనిన్ మహాశయుడు చెప్పాడు. తమదైన జీవకళను కోల్పోయి కేవలం మార్కెట్‌లో అమ్ముడుబోయే కొనబడే సరుకుగా ప్రజలను మరింతంగా దిగజార్చేందుకు పెట్టుబడివర్గం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. బుద్ధిజీవుల్ని కూడా కళావిహీనులుగా, డాలర్ యంత్రాలుగా మారుస్తున్నది. అందుకే ఈ నేపథ్యంలో ప్రజాసాంస్కృతిక కార్యకర్తల కర్తవ్యం ముందుకు తీసుకొస్తున్నది. ముందు ఈ ప్రపంచీకరణ మాయాజాలంలో, మతోన్మాద వలయంలో చిక్కుకోకుండా తమని తాము కాపాడుకోవాలి. నిరంతరం ప్రజాపక్షం ఉండి, నిబిడీకృతమైన ప్రజాకళలను కళాకారులను వెలికితీసి సానపెట్టేందుకు దీక్షతో కృషి చేయాలి. అసత్యాలు, భ్రమలు, భయాలు తొలగిపోయి ప్రజలు నిత్యచైతన్యంతో ప్రకాశించేలా మేల్కొల్పాలి. అందుకు విస్తృత ప్రజాకళాప్రదర్శనలు మినహా వేరే మార్గం లేదు. అవసరమైన వర్క్‌షాప్‌లు, శిక్షణా శిబిరాలు, గోష్ఠులు, చర్చలు ఎల్లవేళలా సాగుతూ ఉండాలి. ఎవరిలో ఎలాంటి ప్రతిభ దాగి వుందో గమనించి వారిని ప్రోత్సహించి, ఉత్సాహపరిచి వారి శక్తియుక్తులన్నింటిని ప్రజలపరం చేయాలి. ఏ కళాకారుడైనా సామాజిక అన్యాయాలపై మొట్టమొదటగా తిరగబడేది తనదైన కళాశైలి ప్రతిభతోనే. తరతరాలుగా అణచివేతకు గురికాబడిన అట్టడుగు వర్గాలు, తమ డిమాండ్‌లను ఆత్మగౌరవాన్ని సాంస్కృతిక రూపాల్లో శక్తివంతంగా ప్రకటిస్తున్నాయి. ఈ యువత శక్తినంతటిని ప్రజా ఉద్యమాల్లో మమేకం చేయాల్సిన బాధ్యత ప్రజాసాంస్కృతిక కార్యకర్తలపై ఉన్నది. డా॥ రాజారావు చూపిన ఈ అసమాన కృషే సాంస్కృతిక కార్యకర్తలకు శిరోధార్యం. ఇటీవల చనిపోయిన పద్మశ్రీ అల్లు రామలింగయ్య, మిమిక్రీ పితామహుడు వేణుమాధవ్, నాట్యాచార్యులు కోరాడ నర్సింహమూర్తి వంటి మేటి కళాకారులు డా॥ రాజారావు కృషితో గుర్తింపు పొందిన వారే. తెలుగు సాంఘిక నాటక రంగాన్ని సుసంపన్నం చేసినా, జానపద కళలలో రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలు చొప్పించి ప్రజా కళలుగా మార్చి ప్రజలకు అందించినా ఈ కృషిలోనే సాగింది. అందుకే విశాల ప్రాతిపదికపై సాంస్కృతిక సైన్యం నిర్మించేందుకు డాక్టర్ రాజారావు నిర్వహించిన ప్రజా కళల కృషి సదా అనుసరణీయం.

త్రివర్ణ పతాకమా, నేనూ దేశభక్తుణ్ణే

దేశమంటే మనుషులోయ్ అన్న
మహాకవి మానస పుత్రుణ్ని
ఉదయం, సాయంత్రం
వందేమాతర గీతాన్ని జనగణమన గేయాన్ని
పాడుకునే భారతీయుణ్ని
జాతీయ పతాకంలోని మూడు రంగులలా
దేహాన్ని రంగులమయంగా చేసుకున్నవాణ్ణి
నేను దేశభక్తుణ్ణి
నేను భారతీయుణ్ణి
గోడలపై వందేమాతర గీతాన్ని పాడాలని హెచ్చరిస్తూ
సిరా చుక్కలతో విషం కక్కుతున్నవాణ్ణి
దేశ భౌగోళిక సరిహద్దుల వరకు
దేశభక్త స్వరాన్ని వినిపిస్తున్నవాణ్ణి
ఓ చేతిలో విదేశీ పానీయాన్ని పట్టుకొని
కళ్ళను ఫ్యాషన్ ఛానెల్‌కు అప్పగించినవాణ్ణి
నేను, దేశభక్తి గురించే మాట్లాడతాను
నా బాల్యంలో
త్రివర్ణ పతాకాన్ని నా కళ్ళముందుంచిన
హెలీనారాణి దేశభక్తి గురించి మాట్లాడతాను
పంద్రాగష్టునాడు కూలి డబ్బులతో
నిమ్మతొనల చాక్లెట్లను పంచిన
మున్నాభాయ్ హృదయ వైశాల్యం గురించి
మాట్లాడతాను
భారతి టీచర్ జీసస్‌ను ప్రార్థిస్తున్నప్పుడు
చూచిన బాల్యపు జ్ఞాపకం,
భీష్మీ సముద్రంపై చూచిన మత్స్యకారుని బతుకు భయం,
బెజవాడ ముఠాకార్మికుని ఆకలి దేహం
పచ్చని చేలో నుంచున్న అన్నదాతను చూచిన
జ్ఞాపకాల దొంతర్లలో దేశభక్తిని చూస్తున్నాను.
జీవనదులను, బంగాళాఖాతాన్ని చూచిన కళ్ళతో
నా దేశ అంతరంగాన్ని చూస్తున్నాను
శ్రమజీవుల, చెమటచుక్కలతో తడిసిన
జాతీయ పతాకాన్ని చూస్తున్నాను
మట్టిని ముద్దాడుతున్నట్లే
జాతీయ పతాకానికి వందనం చేస్తాను
పూదండలోని దారంలా విభిన్న జాతుల
పుష్పాలను కలిపి ఉంచిన త్రివర్ణ పతాకానికి
సెల్యూట్ చేస్తాను
నేను దేశభక్తుణ్ణి
నా తల్లి చనుబాల ధార నుండి
దేశభక్తి నా రక్తంలోకి ప్రవహించింది
ప్రవహిస్తున్న జీవనదిలా
మనుషుల హృదయాలలోకి ప్రేమబీజమై
ప్రవహించడం తెలుసు
వెలుగులను వెదజల్లుతూ
మైనపు ముద్దలా కరగడం తెలుసు
మనుషుల్ని విడదీసే పదబంధాలు నా గొంతులో లేవు
నా జాతీయ పతాకానికీ లేవు
నేను దేశాన్ని ప్రశ్నిస్తున్నాను
నా ముందు కోట్లాది దేవతలనుంచిన వారిని
ప్రశ్నిస్తున్నాను
మనిషికి మతమెందుకని ప్రశ్నిస్తున్నాను
కాషాయ దళాల చేతులలో జాతీయ పతాకం
ఓటి ఉద్యమం అయినందుకు దుఃఖిస్తున్నాను
అమ్మ చేయి స్పర్శంత చల్లని జాతీయ జెండా
రాజకీయమైనందుకు కలత చెందుతున్నాను
నేను దేశభక్తుణ్ణి
మనుషుల్ని సకల ఉద్వేగాల్ని
గుండెల్లో ప్రతిష్ఠించుకునే ఈ మనుషుల వారసుణ్ణి
నేను భారతీయుణ్ణి
(ఉమాభారతి తిరంగ ఉద్యమాన్ని నిరసిస్తూ)

- అరసవిల్లి కృష్ణ

ADVOCATE

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

మూడవతాత ఆస్తిపై హక్కులేంటి?

మూడవ తాత ఆస్తులపై మొదటి ఇద్దరు తాతల వారసత్వానికి, వంశపారంపర్య హక్కు కలిగి ఉంటామా, లేదా? కోర్టుకెళితే న్యాయం జరుగుతుందా? కోర్టుకి ఏ విధంగా వెళ్ళాలి? మా తాతలు ముగ్గురు. మొదటి ఇద్దరు తాతల వారసత్వాలు కొనసాగుచుండగా, మూడవతాత వారసత్వం ఒక్కొక్కరితోనే కొనసాగి, చివరివాడు ఒక్కడుకూడా ఇటీవలే చనిపోయాడు. అతనికి ఎలాంటి సంతానంలేదు. చనిపోయిన తమ్ముడి తోడ ఒక్క చెల్లి ఉన్నది. ఆమెను గత పది సంవత్సరాలక్రితమే వేరే ఊరికి ఇచ్చి పెళ్ళి జరిపారు. ఆమె సంసారం అత్తగారింటిదగ్గరనే స్థిరపడినది. మూడవ తాత వారసుడు చనిపోయిన తర్వాత, అతని భార్య, తన పుట్టింటికి వెళ్ళిపోయినది. ప్రస్తుతం మా చిన్నమ్మ ఒకామెనే బ్రతికిఉంది. ఆమెను ఎవ్వరూ చూసేవాళ్ళులేరు. కావున మూడవతాత ఆస్తులపై మా వంశపారంపర్య హక్కు ఉంటుందా? లేక అతడి చెల్లెలికి ఉంటుందా? పుట్టింటికి వెళ్ళిపోయిన భార్యకు చెందుతుందా? తెలియజేయ ప్రార్ధన. మూడవతాత ఆస్తులను, రెండవతాత వారసులు రాజకీయంగా తమ సొంతం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. మాకు న్యాయం జరిగేదెలా?

- సుధాకర్, మహబూబ్‌నగర్.

భర్త చనిపోయిన అతడి పేరుతో ఉన్న ఆస్తికి భార్య వారసురాలుగా గుర్తించబడుతుంది. పుట్టింటికి పోయినా ఆస్తి తనదే అవుతుంది కాని అతడి సోదరులకు చెందదు. చనిపోయిన తమ్ముడి తోడ చెల్లి ఉందంటున్నారు. తనకు వాటా ఉంటుంది. తాత అన్నారు. చిన్నమ్మ అన్నారు. మీ ప్రశ్న సరిగా వ్రాయలేదు. పురుషుడితోపాటు స్త్రీకి సమానంగా వాటా ఉంటుంది.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :

న్యాయసలహాలు

ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి దినపత్రిక,
స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

భరణం మాత్రమే వస్తుంది

నాకు 40సంవత్సరాల క్రితం వివాహం అయింది. ఒక కుమార్తె. నా కుమార్తెకి 5వ ఏడాది వచ్చినప్పుడునుంచి నా భర్త నన్ను అనేకరకాలుగా హింసిస్తునాడు. తీవ్రంగా కొడుతున్నాడు. వేరే ఇంకో పెళ్ళికావాలని చిత్రహింసలు పెట్టాడు. నన్ను ఎవరితోనూ మాట్లాడకుండా, బయటకు వెళ్ళకుండా ఇంట్లోనే ఉండేలా కట్టడి చేశాడు. అతను అనేక అక్రమ సంబంధాలు పెట్టుకుని జల్సాలు చేశాడు. పొలంలో వ్యవసాయంద్వారా వచ్చే ఆదాయం అంతా తన సరదాలకే ఖర్చు చేశాడు. నాకు నా కూతురికి ఎడాదికి ఒక జత బట్టల తప్ప వేరే ఏ ఖర్చు పెట్టడు. వేరే పెళ్ళి చేయాల్సిందేనని మమ్మల్ని కొట్టేవాడు. నా కూతురు 10వ తరగతి చదువుతున్నప్పుడు నేను, నా కూతురు, అతను కలిసివెళ్ళిమరీ పెళ్ళిసంబంధాలు కూడా చూశాం. నా కూతురు ఎదురుతిరిగి, తనకు పెళ్ళి చేశాక ఏవన్నా చేసుకో అని అంది. తండ్రి బాధ భరించలేక నా కూతురు వేరే అతన్ని ప్రేమించి పెళ్ళి చేసుకుని అత్తవారింట ఉంటోంది. దాని పెళ్ళి అయిన మూడునెలలకే ఆయనా పెళ్ళి చేసుకున్నాడు. అప్పటినుండి నేనంటే మరింత చిరాకుపడి కొడుతున్నాడు. అతనేకాక అతని రెండవభార్యకూడా కలిసి నా కుడిచెయ్యి విరగకొట్టారు. నా పుట్టింటివాళ్ళతో మాట్లాడనివ్వలేదు. ఇప్పుడు నా కూతురుతో కూడా మాట్లానివ్వడంలేదు. అతని రెండోభార్యకు ముగ్గురు సంతానం. ఇప్పుడు నేను మూడుసంవత్సరాలుగా అదే ఊళ్ళోని నా పుట్టింట్లో ఉంటున్నాను. నన్ను రమ్మని గ్రామపెద్దలతో కబురంపిస్తున్నాడు. అతని వద్దకు వెళ్ళితే చంపేస్తారని అందరూ అంటున్నారు. నా భర్తకు 10ఎకరాలు పొలం ఉంది. నా భర్త ఆస్తి నాకు వస్తుందా? దానికి నన్ను ఏంచెయ్యమంటారు?

- ఒక సోదరి, హైదరాబాద్.

మీరు మీభర్తగారికి గతంలోనే పెండ్లి చేసినట్టున్నారు. ఏ హిందువు కూడా భార్య బ్రతికుండగా ఇంకో పెండ్లి చేసుకోకూడదు. వారికి ముగ్గురు సంతానం అన్నారు. మీరు కలిసి ఉండటం లేదు. కావున మీ పుట్టింట్లో ఉంటున్నారు కాబట్టి మీరు అతనినుండి మీ ఖర్చులకుగాను భరణం అడగవచ్చు. కాని ఆ పది ఏకరాలలో మీకు భాగం ఏమీరాదు. మీ అమ్మాయికి భాగం వస్తుంది. మీరు మీ జీవితాంతం మీ భర్తగారి నుండి గాని, వారి సంతానం నుండిగాని నెలసరి భరణం పొందగలుగుతారు.

రుచి

మిక్స్‌డ్ దోసె

కావలసిన వస్తువులు :

కందిపప్పు	:	అర కప్పు
మినపప్పు	:	అర కప్పు
శనగపప్పు	:	అర కప్పు
పెసరపప్పు	:	అర కప్పు
టమాటో రసం	:	ఒక కప్పు
కారం	:	ఒక టీ స్పూన్
ఉప్పు	:	తగినంత

తయారుచేసే విధానం :

పప్పులన్నింటినీ మూడు లేదా నాలుగు గంటలు నానపెట్టుకోవాలి. వాటిని దోసె పిండి మాదిరిగా రుబ్బుకోవాలి. అందులో టమాటా రసం, ఉప్పు, కారం కలపాలి. ఈ పిండిని దోసెలు వేసుకోవాలి. అన్ని పప్పుల వల్ల బలం కూడా. కందిపప్పు బదులు బియ్యం కూడా వేసుకోవచ్చు.

పెసరపప్పు పకోడి

కావలసిన వస్తువులు:

పెసరపప్పు	:	రెండు కప్పులు
పాలకూర	:	ఒక కట్ట
పచ్చి మిర్చి పేస్ట్	:	ఒక టీ స్పూన్
ఉప్పు	:	తగినంత
కొత్తి మీర	:	ఒక కట్ట
ఉల్లిపాయ ముక్కలు	:	అర కప్పు
జీలకర్ర	:	అర టీ స్పూన్
అల్లం, వెల్లుల్లి పేస్ట్	:	ఒక టీ స్పూన్
నూనె	:	వేయించడానికి

తయారుచేసే విధానం :

పెసరపప్పును నానబెట్టు కోవాలి. నానిన తరువాత వాటిని వడబుట్టలో వేసి నీళ్ళన్నీ పూర్తిగా పోయే వరకూ ఉంచి మెత్తగా రుబ్బుకోవాలి. మరీ జావగా కాకుండా చూసుకోవాలి. పాలకూరలు సన్నగా తరిగి ఈ పిండిలో కలపాలి. మిగిలిన ముక్కలన్నింటినీ కూడా ఇందులో బాగా కలుపుకోవాలి. ఈ పిండిని పకోడీల మాదిరి వేసుకోవాలి. వీటిని అలాగే తినవచ్చు. లేదా చట్నీతో కూడా రుచిగా ఉంటాయి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే

ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్థసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761,
మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది